ఏలూరు ఉష్ణోగ్రతలు
గరిష్ఠం : 32.0
కనిష్ఠం : 27.0

ANDHRAJYOTHY
ఆంధ్రజ్యోతి
ఏలూరు
జిల్లా వార్తలు
5
మంగళవారం 4 జూన్ 2024



విజేతలెవరో!

నేడే కౌంటింగ్.. ఓటరు తీర్పు వెల్లడి

- ఢిల్లీ వెళ్ళే ధీరులెవరో.. అసెంబ్లీలో అడుగుపెట్టే అదృష్టవంతులెవరో
- ఉదయం 8 గంటల నుంచే పోస్టల్ బ్యాలెట్ల లెక్కింపు ప్రారంభం
- 8.30 నుంచి ఈవీఎంల ఓట్ల లెక్కింపు ప్రారంభం
- ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల్లో 86 మంది
- ఎంపీ బరిలో 13 మంది అభ్యర్థులు
- రెండుచోట్ల అంతా కొత్త ముఖాలే

అసెంబ్లీ నియోజకవర్గాలకు రారాజులెవరో.. ఏలికలు ఎవరో, పరాజితులు మరెవరో. నేడు ప్రజాతీర్పు.. కొద్దిగంటల వ్యవధిలోనే తొలిఫలితం వెలువడేలా భారీ ఏర్పాట్లు.. నెలల తరబడి ఓపిక పట్టి పోలింగ్, ఆ తదుపరి మూడు వారాలు వేచి ఉన్నవారందరికి నేడు సస్పెన్స్ వీడ బోతోంది. విజయంపై టీడీపీ కూటమి, వైసీపీ ఎవరికి వారు ధీమా వ్యక్తం చేస్తున్నారు.

(ఏలూరు-ఆంధ్రజ్యోతి ప్రతినిధి):

గడిచిన రెండు మాసాలుగా నువ్వానేనా అన్నట్లుగా అటు లోక్‌సభా స్థానంలోనూ, ఇటు అసెంబ్లీ స్థానాల్లోనూ హోరాహోరీ యుద్ధమే సాగింది. ఆరోపణలు, ప్రత్యారోపణలు సాగాయి. పార్టీల అధినేతలు నియోజకవర్గాల్లో విస్తృతంగా పర్యటించారు. ఓటర్లకు తాను ఏం చేయబోతున్నామో చెప్పి తమవైపు మళ్ళేలా గుర్తించే ప్రయత్నం చేశారు. అందరి మనసు దోచుకోవడానికి పోలింగ్ ముందు వరకు విశ్వ ప్రయత్నం చేశారు. ఎవరు ఓటుకోసం ఇంటికి వచ్చి అభ్యర్థించినా జనం వాదనకు దిగకుండా తల ఊపారు. వేయాల్సిన ఓటు ఎవరికో నిర్ధారించుకుని పోలింగ్ వరకు ఓటర్లు గుమ్మనంగా ఉన్నారు. గాలిమావైపే అంటే కాదుకాదు మావైపే నంటూ పార్టీలన్ని పోలింగ్‌నాడే లెక్కలు కట్టాయి. నియోజకవర్గాల వారీగా తాము ఎక్కడా బలవంతులమో, మరెక్కడ బలహీనులమో పోలింగ్ బూత్‌ల వారీగా లెక్కలు తీశారు. ఈ క్రమంలోనే ఈసారి అంతా ఆషామాషీ కాదు, ఓటరు నాడి చూసినా అంత తేలిగ్గా కనిపించడం లేదు. డబ్బు అయితే పంచాము కాని, ఓటు దక్కిందో లేదో మంగళవారం జరగనున్న ఓట్ల లెక్కింపులో కాని తెలియదు అన్నట్లుగా తల పండిన రాజకీయ విశ్లేషకులు కొందరు చేతులెత్తేశారు. మరి కొందరు గోదావరి జిల్లాల్లో బలమెటో తేల్చేశారు. కూటమి అధికారంలోకి రావడం ఖాయమని, ఎగ్జిట్ పోల్స్ తేల్చాయి. వైసీపీ వెనుకబడడం ఖాయమని కొన్ని సంస్థలు నిర్ధారించగా, మరికొన్ని రెండోసారి ఛాన్స్ పాలక పార్టీకేనని జోస్యాలు చెప్పాయి. ఓటు వేసిన సామాన్య జనం అందరి విశ్లేషణలు, విడమర్చి ప్రకటించిన లెక్కలు, అనుకూలతలపై ఇప్పటివరకు కామెంటే చేయకుండా సైలెంట్‌గా ఉన్నారు. ప్రజాతీర్పు వెలువర్చే క్షణాలు రానేవచ్చాయి. మరికొద్ది గంటల్లోనే తీర్పుకు అందరూ తలవంచాల్సిందే.

అన్ని పార్టీలకు ఈ తీర్పే సవాల్..

ప్రత్యేకించి అధికార వైసీపీ రెండోసారి పగ్గాలు చేపడతామని ఇప్పటికి లెక్క కట్టింది. వైసీపీ అంచనాలను తల్లకిందులు చేస్తామని ఏలూరు లోక్‌సభ స్థానంలో ఆ పార్టీకి అడ్రస్సే లేకుండా పోతుందని తెలుగుదేశం, జనసేన, బీజేపీ కూటమి గాండ్రిస్తోంది. ఈసారి నమోదైన ఓట్లశాతంతో పాటు పోటీచేసిన అభ్యర్థులు సంఖ్య విచిత్రంగానే ఉంది. రిజర్వుడ్ నియోజకవర్గాలైన పోలవరం, చింతలపూడిలో పోటీ చేయడానికి అభ్యర్థుల కొరత ఇంతకు ముందు ఉండేది. 2014-19 సాధారణ ఎన్నికలతో పోలిస్తే ఈసారి ఈ రెండు నియోజకవర్గాల్లోనూ అభ్యర్థుల సంఖ్య సంతృప్తికరంగానే ఉంది. దీన్నిబట్టి చూస్తే పోటీ తీవ్రత ఎంత గాఢంగా ఉందో అంతే స్థాయిలో అభ్యర్థుల పోటీ సాగినట్టు అయింది. ఎంపీ స్థానానికి సంబంధించి ఒకప్పుడు 9 నుంచి 10మంది లోపే పోటీకి అభ్యర్థులు ఉండేవారు. ఇప్పుడు ఏలూరు లోక్‌సభ స్థానానికి పోటీచేసిన అభ్యర్థుల సంఖ్య 13గా ఉంది. ఏలూరు లోక్‌సభలో అభ్యర్థులే కాకుండా ఈ సారి బీసీ వర్గాల మధ్యే ప్రధాన పక్షాల పోటీ అనివార్యంగా మారింది. తెలుగుదేశం పక్షాన పుట్టా మహేష్ యాదవ్, వైసీపీ పక్షాన కారుమూరి సునీల్‌కుమార్ పరస్పరం పోటీ పడ్డారు. వీరిద్దరు ఒకే సామాజిక వర్గానికి చెందిన వారు కావడంతో ఓట్ల చీలిక అనివార్యంగా మారింది. కొన్నిచోట్ల క్రాస్ ఓటింగ్ జరిగింది. వీటన్నింటిని బట్టి చూస్తే టీడీపీ అభ్యర్థి పుట్టా మహేష్ కుమార్‌కు అనుకూలత ఎక్కువగా ఉన్నట్లు పోలింగ్ రోజునే విశ్లేషించారు. అసెంబ్లీ నియోజకవర్గాల వారీగా వస్తే దెందులూరులో టీడీపీ పక్షాన ఇంతకు ముందు మూడుసార్లు తలపడిన చింతమనేని ప్రభాకరే మరోసారి రంగంలో నిలిచారు. ఆయనకు ప్రధాన ప్రత్యర్థిగా వైసీపీకి చెందిన అబ్బయ్య చౌదరి రెండోసారి తన అదృష్టాన్ని పరిశీలించుకోబోతున్నారు. ఏలూరులో రాజకీయంగా సీనియర్, మాజీ మంత్రి, వైసీపీ అభ్యర్థి ఆళ్ళనానిపై తొలిసారిగా పోటీకి దిగిన టీడీపీ అభ్యర్థి బడేటి చంటి అటు ప్రచారంలోనూ, ఇటు ఓటర్లను ఆకర్షించటంలో తనదైన శైలి ప్రదర్శించి అనుకూలతలే ఎక్కువగా ఉండేలా జాగ్రత్త పడ్డారు. ఉంగుటూరు నియోజకవర్గం నుంచి జనసేన అభ్యర్థి పత్సమట్ల ధర్మరాజు బరిలో ఉండగా, ఆయనను సీనియర్ ఎమ్మెల్యేగా ఉన్న కుప్పాల వాసుబాబు, వైసీపీ పక్షాన ఢీ కొంటున్నారు. వీరిద్దరి మధ్య హోరాహోరీ పోరుసాగి ఓటర్లలోనూ ఉత్కంఠ రేపింది. ఎస్సీ రిజర్వుడ్ నియోజకవర్గం చింతలపూడిలో తెలుగుదేశం పక్షాన రోషన్‌కుమార్ బరిలోకి దిగారు. తొలిసారి పోటీ చేస్తున్న ఆయన ఇక్కడ అన్ని సామాజిక వర్గాలను కలుపుకుపోయేందుకు ప్రయత్నించారు. అనుకూలతలు అన్ని తనవైపే ఉన్నాయని ధీమాగా ఉన్నారు. ప్రభుత్వ ఉద్యోగం నుంచి రాజకీయాల్లోకి ప్రవేశించిన వైసీపీ అభ్యర్థిగా కె.విజయ్‌రాజు సైతం తొలిసారిగా అసెంబ్లీ బరిలో ఉన్నారు. అటు రోషన్, ఇటు విజయ్‌రాజు మధ్య ఓటర్లు ఎవరివైపు అనుకూలత ప్రదర్శించారో నేడు తేలబోతోంది. పోలవరం ప్రాజెక్టుకు ఆయువుపట్టు అయిన పోలవరం ఎస్టీ రిజర్వుడ్ నియోజకవర్గం నుంచి జనసేన అభ్యర్థిగా చిర్రి బాలరాజు తొలిసారిగా పోటీలోకి దిగారు. అంతే సమాంతరంగా ప్రభుత్వ ఉపాధ్యాయురాలు, ప్రస్తుత సిట్టింగ్ వైసీపీ ఎమ్మెల్యే తెల్లం బాలరాజు సతీమణి రాజ్యలక్ష్మి పోటీ చేశారు. రిజర్వుడ్ నియోజకవర్గాలైన చింతలపూడి, పోలవరంలోనూ రాజకీయాల్లో కొత్త అయిన ఈ ప్రధాన పార్టీల అభ్యర్థుల్లో ఎవర్ని ఎంచుకోవడానికి సిద్ధపడ్డారో నేడు తేలబోతోంది. నూజివీడు నియోజకవర్గంలో టీడీపీ పక్షాన మాజీ మంత్రి కొలుసు పార్థసారథి పోటీచేయగా, సీనియర్ ఎమ్మెల్యేగా వైసీపీ పక్షాన మేకా వెంకట ప్రతాప్ అప్పారావు ఢీ కొంటున్నారు. వీరిద్దరి నడుమ పోటీ ఒక ఎత్తుగా సాగగా, ఫలితాలు ఏ వైపు మొగ్గు చూపబోతున్నా యో ఆదేస్థాయిలో ఉత్కంఠ రేపుతున్నాయి. కైకలూరు నియోజకవర్గంలో సీనియర్ నేత డాక్టర్ కామినేని శ్రీనివాస్, బీజేపీ పక్షాన రంగంలో నిలువగా, ఆయనను వైసీపీ పక్షాన రెండోసారి పోటీ చేస్తున్న సిట్టింగ్ ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు ఢీ కొంటున్నారు. వీరిద్దరి మధ్య నువ్వానేనా అనే స్థాయిలో సాగిన యుద్ధంలో మొదలు తటస్థ ఓటర్లే తీర్పులో కీలకం కాబోతున్నారు.

ఏలూరు లోక్‌సభ అత్యంత విలక్షణం

ఏలూరు లోక్‌సభ స్థానంలోనూ దీని పరిధిలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల్లోనూ ఈసారి విలక్షణమైన పోటీ సాగింది. చింతలపూడి, పోలవరం, ఏలూరు నియోజక వర్గాల్లో కొత్త ముఖాలు బరిలో నిలిచాయి. డాక్టర్ కామినేని శ్రీనివాస్, కొలుసు పార్థసారథి, మేకా వెంకట ప్రతాప్ అప్పారావు, చింతమనేని ప్రభాకర్ వంటి సీనియర్లు ఈసారి తమ అదృష్టాన్ని పరిశీలించుకోబోతున్నారు. ఎన్నికల ఎత్తుగడలో ఆరితేరిన వీరంతా ఒక వ్యూహం ప్రకారం ముందుకే సాగారు. ఆర్థికంగా, ఇమేజ్‌పరంగా ఎక్కడా వెనక్కి తగ్గకుండా తమ నియోజకవర్గాల్లో ఎత్తులు వేశారు. కొన్నిచోట్ల ఆసాంతం సక్సెస్ అవ్వగా, మరికొన్నిచోట్ల ఫిఫ్టీ ఫిఫ్టీగా సాగాయి. ఏలూరు లోక్‌సభ స్థానం పరిధిలో రాజకీయ కుటుంబాలకు చెందిన వారే ప్రధాన పార్టీల నుంచి అభ్యర్థులుగా రంగంలోకి దిగడం ఈసారి విశేషం. తెలుగుదేశం సీనియర్‌నేత, మాజీ మంత్రి యనమల రామకృష్ణ అల్లుడు, టీటీడీ బోర్డు మాజీ ఛైర్మన్ పుట్టా సుధాకర్ తనయుడు అయిన పుట్టా మహేష్ కుమార్ యాదవ్ ఏలూరు లోక్‌సభ స్థానంలో బరిలో నిలిచారు. రాజకీయాల్లో కొంత కొత్త అయినా రాజకీయ కుటుంబాల నేపథ్యం ఉండడంతో పోల్ మేనేజ్‌మెంట్‌లో ఎక్కడా వెనక్కి తగ్గలేదు. అధిష్ఠానాన్ని ఒప్పించే విషయం లోనూ ధైర్యం చేశారు. మరోవైపు మంత్రి కారుమూరి నాగేశ్వ రరావు తనయుడు కారుమూరి సునీల్‌కుమార్ లోక్‌సభ అభ్యర్థిగానే బరిలో నిలిచి కొన్ని నియోజకవర్గాల్లో పట్టు సాధించేందుకు ప్రయత్నించారు. వీరిద్దరి మధ్య పోటీ ఆసాంతం ఉత్కంఠగానే సాగింది. ఏలూరు లోక్‌సభ స్థానం పరిధిలో ఆది నుంచి తెలుగుదేశం అత్యధిక స్థానాల్లో పోటీ చేస్తూ వచ్చింది. కాని ఈసారి పొత్తుపేరిట ఏడు అసెంబ్లీ స్థానాల్లో మూడింటిని బీజేపీ, జనసేనకు వదిలేసింది. దీంతో ఓట్ల బదిలీయే పార్లమెంట్ స్థానాన్ని నిర్దేశించబోతోంది.

అసలు కంటే పోస్టల్ ఓట్లకే భారీ ఏర్పాట్లు

ఏలూరు లోక్‌సభ స్థానం పరిధిలోని ఈవీఎంలలో నమోదైన అసలు ఓట్ల కంటే పోస్టల్ ఓట్లకే ఈసారి టెన్షన్ ఎక్కువైంది. పోస్టల్ బ్యాలెట్ల వివరాలు ఉంగుటూరు 1,614, దెందులూరు 2,165, ఏలూరు 3,123, పోలవరం 2,872, చింతలపూడి 2,267, నూజివీడు 1,923, కైకలూరు 1,651, మొత్తం 15,615. వృద్ధులు, అత్యవసర సర్వీస్ ఓటర్లు ఉంగుటూరు 368, దెందులూరు 358, ఏలూరు 826, పోలవరం 145, చింతలపూడి 238, నూజివీడు 267, కైకలూరు 341 మొత్తం 2,543.



కౌంటింగ్ జరిగే సర్ సీఆర్ఆర్ ఇంజనీరింగ్ కళాశాల

ముందు పోస్టల్ ఓట్ల లెక్కింపే

ఈసారి పోస్టల్ బ్యాలెట్ ఓట్ల లెక్కింపు, ఫలితాలు జారీ మిగతా ఓట్ల లెక్కింపుపై ప్రభావం చూపకుండా జాగ్రత్త పడుతున్నారు. తొలుత మంగళవారం ఉదయం 8 గంటలకు పోస్టల్ బ్యాలెట్ ఓట్ల లెక్కింపు ఆరంభమవుతుంది. ఎంపీ నియోజకవర్గ పరిధిలో 14 టేబుళ్లను ఏర్పాటు చేస్తున్నారు. వీటన్నింటిని కలిపి సాయంత్రం 4.5 లోపే ఫలితాలను వెలువరిస్తారు. ఈలోపు మంగళవారం ఉదయం 8.30 దగ్గర నుంచి ఈవీఎంల ఓట్ల లెక్కింపు ప్రారంభమవుతుంది. తొలి గంటలోనే ఒకటి, రెండు నియోజకవర్గాలు తొలిరౌండ్ పూర్తి చేసేందుకు అధికారులు ఏర్పాటు చేశారు. సాధ్యమైనంత మేర ప్రతి అసెంబ్లీ నియోజకవర్గానికి ఎంపీ అభ్యర్థికి 14 టేబుళ్లు, అసెంబ్లీకి సమాంతరంగా మరో 14 టేబుళ్లు అంటే మొత్తం మీద ఒక్కో నియోజకవర్గానికి 28 టేబుళ్లు ఏర్పాటు చేస్తున్నారు. అటు 14, ఇటు 14 ఈవీఎంలలో ఒకేసారి ఓట్ల లెక్కింపు జరగబోతోంది. వీలు కుదిరితే మొదటి రౌండ్ వరకు ఎక్కడైనా అభ్యంతరాలు ఉన్నా కాస్త ఆలస్యమైనా రెండో రౌండ్ నుంచి లెక్కింపు వేగాన్ని పెంచబోతున్నారు. ఎక్కడైతే పోలైన ఓట్ల సంఖ్య తక్కువగా ఉంటుందో, ఆయా నియోజకవర్గాల్లో ఫలితాలను త్వరగా ప్రకటించాలన్న ఆతృత అధికారుల్లోనూ ఉంది. ఎక్కడికక్కడ మంగళవారం ఉదయమే కౌంటింగ్ కేంద్రాల్లో డెమో నిర్వహిస్తారు. ఏజెంట్లు విషయంలోనూ వారి కదిలికలపైన ఓ కన్నేసి ఉంచారు.

పోటీ చేస్తున్న అభ్యర్థుల సంఖ్య	
ఏలూరు ఎంపీ స్థానం	13
ఏలూరు అసెంబ్లీ స్థానం	14
ఉంగుటూరు	12
దెందులూరు	15
పోలవరం	12
చింతలపూడి	8
నూజివీడు	10
కైకలూరు	15



- ఏలూరు -పార్లమెంట్: మహేష్ యాదవ్ (టీడీపీ), సునీల్ కుమార్(వైసీపీ)
- ఏలూరు అసెంబ్లీ: బడేటి చంటి(టీడీపీ), ఆళ్ల నాని (వైసీపీ)
- దెందులూరు: ప్రభాకర్(టీడీపీ), అబ్బయ్య చౌదరి(వైసీపీ)
- ఉంగుటూరు: ధర్మరాజు(జనసేన), వాసుబాబు(వైసీపీ)
- చింతలపూడి: రోషన్‌కుమార్ (టీడీపీ), విజయరాజు(వైసీపీ)
- పోలవరం: బాలరాజు(జనసేన), రాజ్యలక్ష్మి (వైసీపీ)
- నూజివీడు: పార్థసారథి (టీడీపీ), ప్రతాప అప్పారావు (వైసీపీ)
- కైకలూరు: కామినేని(బీజేపీ), నాగేశ్వరరావు (వైసీపీ)



కౌంటింగ్ కేంద్రం వద్ద ఏర్పాటు చేసిన బారికేడ్లు



కౌంటింగ్‌కు సిద్ధం చేసిన సామగ్రి



కౌంటింగ్ కేంద్రం వద్ద పోలీస్ బందోబస్తు



వీసీలో పాల్గొన్న కలెక్టర్, ఎస్పీ ఇతర అధికారులు

కౌంటింగ్ ప్రక్రియకు సర్వం సిద్ధం : కలెక్టర్

ఏలూరు సిటీ, జూన్ 3 : ఎన్నికల కౌంటింగ్‌ను పారదర్శకంగా ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు ఏర్పాట్లు చేసినట్లు జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ వైప్రసన్న వెంకటేశ్ తెలిపారు. ఓట్ల లెక్కింపుపై సోమవారం ఆయన మాటాడుతూ 'ఫలితాలను త్వరితగతిన ప్రకటించేందుకు అన్ని చర్యలు తీసుకున్నాం. ఏలూరు పార్లమెంట్ నియోజకవర్గానికి 14 టేబుళ్లు, ఒక్కో అసెంబ్లీ నియోజకవర్గానికి 14 టేబుళ్లను ఏర్పాటు చేశాం. ఆయా నియోజకవర్గాలలోని పోలింగ్ కేంద్రాలను అనుసరించి 16 నుంచి 21 రౌండ్లలో ఓట్ల లెక్కింపు చర్యలు తీసుకున్నాం. ఈవీఎంలలో ఓట్ల లెక్కింపునకు సంబంధించి సాయంత్రం నాలుగు గంటలలోపు పోస్టల్ బ్యాలెట్‌లకు సంబంధించి ఐదు గంటలలోపు పూర్తి ఫలితాలు అందించేందుకు ఏర్పాట్లు చేశాం. కౌంటింగ్ కేంద్రం వద్ద పటిష్ఠమైన నాలుగు అంచెల భద్రతా వ్యవస్థను ఏర్పాటు చేశాం. జిల్లావ్యాప్తంగా 144 సెక్షన్ అమలులో ఉంది. ఓట్ల లెక్కింపు అనంతరం శాంతిభద్రతల పరిరక్షణకు ప్రత్యేక భద్రతా ఏర్పాట్లు కొనసాగుతాయి. 292 మంది మైక్రో పరిశీలకులను, 577 మంది కౌంటింగ్ సిబ్బంది (కౌంటింగ్ సూపర్‌వైజర్ అండ్ కౌంటింగ్ అసిస్టెంట్)లను నియమించాం. పోస్టల్ బ్యాలెట్ కౌంటింగ్ ఉదయం 8 గంటలకు, ఈవీఎం కౌంటింగ్ ఉదయం 8.30 గంటలకు ప్రారంభం అవుతుంది. కౌంటింగ్ ఏజెంట్లను ఉదయం 7 గంటల తర్వాత ఎట్టి పరిస్థితులలోను లోపలకు అనుమతించరు. ఆర్వో టేబుల్ వద్ద పోటీ చేసే అభ్యర్థి లేదా ఎన్నికల ఏజెంట్‌లో ఒక్కరిని మాత్రమే అనుమతిస్తారు. ఈవీఎంలోని ఓట్లను, పోస్టల్ బ్యాలెట్‌లను లెక్కింపు పూర్తయిన తర్వాత, ఐదు వీవీ ప్యాట్ మిషన్లలో స్లిప్‌లను లెక్కిస్తారు. జిల్లాకు నలుగురు కేంద్ర ఎన్నికల పరిశీలకులను ఓట్ల లెక్కింపు పరిశీలనకు నియమించారు. కౌంటింగ్ ఏజెంట్లు ఫారం -17-సి కాపీ, పెన్/పెన్సిల్, సాదా కాగితం/ నోట్ ప్యాడ్ మాత్రమే తీసుకువచ్చేందుకు అనుమతి ఉంది. కౌంటింగ్ హాలులోకి ప్రవేశించడానికి కౌంటింగ్ ఏజెంట్లు అపాయింట్‌మెంట్ లెటర్ రెండవ కాపీని తప్పనిసరిగా సమర్పించాలి. కౌంటింగ్ సెంటర్ ప్రాంగణంలోనే మీడియా సెంటర్, పబ్లిక్ కమ్యూనికేషన్ రూమ్‌ను ఏర్పాటు చేశారు. రౌండ్ వారీ ఫలితాలు మీడియా సెంటర్‌కు అందించబడతాయి.

● ఓట్ల లెక్కింపు విషయంలో ప్రతి క్షణం అప్రమత్తంగా ఉండాలని సీనియర్ డిప్యూటీ ఎలక్షన్ కమిషనర్ నితేష్‌కుమార్ వ్యాస్ అన్నారు. న్యూఢిల్లీ నుంచి సోమవారం సాయంత్రం జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్, జిల్లా ఎస్పీలతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఓట్ల లెక్కింపు కార్య క్రమాన్ని సమర్థవంతంగా నిర్వహించాలన్నారు. స్థానిక ఎన్‌ఐసీ నుంచి జిల్లా ఎన్నికల అధికారి ప్రసన్నవెంకటేష్, ఎస్పీ మేరీప్రశాంతి, కౌంటింగ్ పరిశీలకులు హాజరయ్యారు.

ఇతర వ్యక్తులు ఏలూరు రావద్దు : ఎస్పీ

ఏలూరు క్రైం, జూన్ 3 : ఏలూరు సీఆర్ఆర్ ఇంజనీరింగ్ కాలేజీలో మంగళవారం సార్వత్రిక ఎన్నికల లెక్కిపు జరుగుతున్న నేపథ్యంలో ఏలూరు నగరంలోకి బయటి వ్యక్తులు ఎవరిని అనుమతించబోమని, ఎవరైనా వస్తే వారిపై అనుమానాస్పద వ్యక్తులుగా కఠిన చర్యలు తీసుకుంటామంటూ జిల్లా ఎస్పీ మేరీ ప్రశాంతి హెచ్చరించారు. ఓట్ల లెక్కింపు నేపథ్యంలో ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరణ చేశామన్నారు. సోమవారం రాత్రి 10 గంటల నుంచి మంగళవారం కౌంటింగ్ పూర్తయ్యే వరకూ వాహనాల దారి మళ్లింపు కొనసాగుతుందన్నారు. ఏలూరు మినీ బైపాస్ రోడ్డులో భారీ, మధ్యతరహా రవాణా వాహనాలపై నిషేధం విధించామన్నారు. అత్యవసర వాహనాలు, సీఆర్ఆర్ ఇంజనీరింగ్ కాలేజీలో కౌంటింగ్ వెళ్లే వారి వాహనాలకు అనుమతి ఉంటుంది. కౌంటింగ్‌కు వచ్చే ఏజెంట్లు తమ ఐడీ కార్డులను తీసుకురావాలన్నారు. కౌంటింగ్ వచ్చే ఏజెంట్లు వారు మాత్రమే వాహనాన్ని నడుపుకుని రావాలని డ్రైవర్లను, ఇతర వ్యక్తులను అనుమతించబోమన్నారు. ఏజెంట్లకు సెల్‌ఫోన్లు గాని, ఇతర ఎలక్ట్రానిక్ గాడ్జెట్స్‌ను అనుమతి లేదన్నారు. జిల్లాలో 144, పోలీస్ యాక్టు 30 అమలులో ఉందన్నారు. రాజకీయ పార్టీల మధ్య గొడవలను, విద్వేషాలను రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేసినా సామాజిక మాధ్యమాల్లో ప్రచారం చేసినా చర్యలు తీసుకుంటామన్నారు. ఫలితాలు అనంతరం విజయోత్సవ ర్యాలీలకు బాణసంచా కాల్చడానికి సభలు నిర్వహించడానికి డీజేలను పెట్టి ఊరేగింపులు చేయడానికి అనుమతులు లేవన్నారు.

వందల మంది సాయుధ బలగాలు

కౌంటింగ్ కేంద్రం వద్ద భారీ బందోబస్తును ఏర్పాటు చేశారు. నాన్ కేడర్ ఎస్పీ, ఏసీబీ జాయింట్ డైరెక్టర్ ఈ. సుప్రజ, అదనపు ఎస్పీలు నలుగురు, డీఎస్పీలు ఆరుగులు, 28 మంది సీఐలు, 56 సివిల్ ఎస్‌ఐలు, నలుగురు ఏపీఎఫ్ ఎస్‌ఐలు, ఏఆర్ఆర్‌ఐలు ముగ్గురు, 4 ఆర్‌ఎస్‌ఐలు, 1,225 మంది పోలీస్ సిబ్బంది, 450 మంది సాయుధ బలగాలు, 650 సాయుధ పార్టీ పోలీసులు, ఐదు గ్యాస్‌పార్టీలు, రెండు వజ్ర వాహనాలు, 48 ప్రత్యేక స్ట్రైకింగ్ ఫోర్స్, 39 స్ట్రైకింగ్ ఫోర్స్, 130 పికెట్లు, 8 చెక్‌పోస్టులు, వాటర్ కెనాన్స్, షాడో పార్టీలు, బాక్స్ టైప్ కాన్వాయ్, సోషల్ మీడియా పాయింట్, కంట్రోల్ రూమ్, టిటెంక్షన్ సెంటర్‌లలో సిబ్బందిని నియమించినట్లు ఎస్పీ తెలిపారు.



ఎన్నికల కౌంటింగ్ జరిగే సీఆర్ఆర్ ఇంజనీరింగ్ కాలేజీలో సోమవారం రిహార్సల్స్‌లో బందోబస్తు మ్యాప్‌ను పరిశీలిస్తున్న ఎస్పీ మేరీ ప్రశాంతి

అందని నిధులకు ఆడిటా..!

- ఉపాధ్యాయ వర్గాలు తీవ్ర అభ్యంతరం
- రెండేళ్లుగా స్కూలు నిర్వహణ భారం హెచ్‌ఎంలపైనే
- రూ.కోట్లలో బకాయిలు - ఒక్క రూపాయి జమ చేయకుండానే ఒత్తిళ్లపై విమర్శలు
- రేపటి నుంచి మూడు రోజులపాటు 764 పాఠశాలలకు ఆడిట్
- వాయిదా వేయాలంటూ డీఈవోకు పీఆర్టీయూ, యూటీఎఫ్ నాయకుల వినతి



ఏలూరు ఎడ్యుకేషన్, జూన్ 3 : పాఠశాలల నిర్వహణకు విడుదల కాని నిధుల వినియోగానికి సంబంధించి ఆడిట్ అంటూ సమగ్రశిక్ష జిల్లాప్రాజెక్టు చేపట్టిన హడావుడి ఓ చోద్యంలా మారింది. రెండేళ్లుగా అసలు విడుదల కాని స్కూల్ మెయింటెనెన్స్ గ్రాంట్‌లపై ఆడిట్ ఎలా చేస్తారంటూ ఉపాధ్యాయ వర్గాలు తీవ్ర అభ్యంతరం చెబుతున్నాయి. తొలివిడతగా జిల్లాలోని 764 ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలకు ఆడిట్ చేపట్టడానికి ఈ నెల 5, 6, 7 తేదీల్లో గణాంక బృందాలు సంబంధిత మండల రిసోర్స్ కేంద్రాల్లో ప్రత్యేక డ్రైవ్‌ను నిర్వహించనున్నాయి. ఇందుకుగాను ఈ నెల 5న ఏలూరు మండల రిసోర్స్ సెంటర్‌కు అగిరిపల్లి, భీమడోలు, చాట్రాయి, చింతలపూడి, దెందులూరు, ద్వారకా తిరుమల, ఏలూరు మండలాల పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, 6న గణపవరం, నిడమర్రు, నూజివీడు, కైకలూరు, కలిదిండి, లింగపాలెం, మండవల్లి, ముదినేపల్లి, ముసునూరు, పెదపాడు, పెదవేగి, ఉంగుటూరు మండలాల హెచ్‌ఎంలు, 7న జంగారెడ్డిగూడెం ఎంఆర్‌సీకి బుట్టాయిగూడెం, జంగారెడ్డిగూడెం, జీలుగుమిల్లి, కామవరపుకోట, కొయ్యలగూడెం, కుక్కునూరు, పోలవరం, టి.నర్సాపురం, వేలేరుపాడు మండలాల్లోని పాఠశాలల హెచ్‌ఎంలు హాజరై ఆయా స్కీంలలో విడుదలైన నిధుల వినియోగంపై జరిగే ఆడిట్‌కు హాజరు కావాల్సి ఉంటుంది. ఒక్కో స్కూలు నిర్వహణకు విద్యార్థుల సంఖ్య ఆధారంగా మెయింటెనెన్స్ గ్రాంట్‌ను రూ.12,500 నుంచి రూ.50 వేలు, అంతకుపైబడి ఏటా సమగ్ర శిక్ష ద్వారా ప్రభుత్వం విడుదల చేస్తుంటుంది. ఈ నిధుల తోనే చాక్‌పీసులు, విద్యుత్ బిల్లులు, ఇంటర్నెట్ కనెక్షన్ బిల్లులు తదితర చెల్లింపులకు ప్రధానోపాధ్యాయులు ఖర్చు చేస్తుంటారు. రెండేళ్లుగా ఈ నిధులను ప్రభుత్వం విడుదల చేయకపోవడంతో ప్రధానోపాధ్యాయులే సొంతంగా డబ్బులను ఖర్చు చేస్తున్నారు. జిల్లాలో రూ.కోట్లలోనే మెయింటెనెన్స్ గ్రాంట్ నిధులు బకాయిల రూపంలో హెచ్‌ఎంలకు రీయింబర్స్ కావాల్సి ఉంది. వాస్తవానికి ఏటా విద్యాసంవత్సరం ప్రారంభానికి ముందే ఈ గ్రాంట్‌ను విడుదల చేయాలని ఉపాధ్యాయ సంఘాలు ఏనాటి నుంచో డిమాండ్ చేస్తుండగా, గత రెండు ఆర్థిక సంవత్సరాల్లో ఒక్క రూపాయి కూడా మెయింటెనెన్స్ గ్రాంట్‌రూపేణా విడుదల చేయలేదని పీఆర్టీయూ, యూటీఎఫ్ జిల్లా నాయకులు ఆంజనేయులు, రవికుమార్ వివరించారు. ఇలా నిధులు విడుదల చేయకుండా ఆడిట్ పేరిట హెచ్‌ఎంలను రికార్డులు, బిల్లులు, ఓచర్లు తీసుకుని ఎంఆర్‌సీలకు రమ్మని ఒత్తిడిచేయడమేంటని ప్రశ్నించారు. ఇది ఉపాధ్యాయులపై, ప్రధానోపాధ్యాయులపై ప్రభుత్వం వేధింపులకు పాల్పడమేనన్న ఆరోపణలు వస్తున్నాయి. మరో వారం రోజుల్లో వేసవి సెలవుల అనంతరం పాఠశాలలు తెరుచుకోనుండటం, ఈ లోగానే వివిధప్రాంతాల్లో వున్న హెచ్‌ఎంలు ఆడిట్ కోసం ఎంఆర్‌సీలకు రావాల్సిందేనని ఒత్తిడి చేయడం సరికాదని ఆంజనేయులు వివరించారు. తక్షణమే ఆడిట్ నిర్వహణ తేదీలను పాఠశాలలు తెరిచేవరకు వాయిదా వేయాలని సోమవారం డీఈవో అబ్రహంను కలుసుకుని పీఆర్టీయూ, యూటీఎఫ్ జిల్లానాయకులు వేర్వేరుగా వినతిపత్రాలను అందజేశారు.

డీఈవో ఏమన్నారంటే..

'స్కూల్ మెయింటెనెన్స్ గ్రాంట్ నిధుల ఆడిట్ 2020-21 ఆర్థిక సంవత్సరం నుంచి జరగడం లేదు. నిధులు విడుదలైన సంవత్సరాలకు సంబంధించి మాత్రమే ఆడిట్ చేస్తారు. గ్రాంట్ నిధులు విడుదల కాకపోతే నిల్ రిపోర్ట్‌గా నమోదు చేస్తారు. దీనికి హెచ్‌ఎంలు అందుబాటులో లేకపోతే అతని తరపున అందుబాటులో వున్న తదుపరి ఉపాధ్యాయుడు ఆడిట్‌కు హాజరయ్యే వెసులుబాటు ఉంది. మెయింటెనెన్స్ గ్రాంట్ నిధుల వినియోగంతో పాటు, నాడు-నేడు కార్యక్రమం రెండు విడతల నిధులు, పీఎం శ్రీ ప్రోగ్రాంకు విడుదలైన నిధుల వినియోగంపై ఆడిట్ జరుగుతుంది.' అని డీఈవో అబ్రహం వివరించారు.

చేపల చెరువులో మునిగి అన్నాచెల్లెళ్లు దుర్మరణం

» అన్నవరంలో విషాదం

ముదినేపల్లి, జూన్ 3 : ముదినేపల్లి శివారు అన్నవరంలో సోమవారం సాయంత్రం విషాదం చోటు చేసుకుంది. చేపల చెరువు ఒడ్డున ఆడుకునేందుకు వెళ్లి ప్రమాదవశాత్తూ నీటిలో మునిగి అన్నాచెల్లెళ్లు దుర్మరణం పాలయ్యారు. ఈ ఘటన గ్రామంలో తీవ్ర విషాదాన్ని నింపింది. స్థానికుల కథనం ప్రకారం గ్రామానికి చెందిన బట్టు సురేష్, రాణి దంపతుల కుమారుడు కుమార్ (7) వర్షిక (4) ఇద్దరు కలిసి తమ ఇంటి వెనుక ఉన్న ఒక చేపల చెరువు ఒడ్డుకు సోమవారం మధ్యాహ్నం ఆడుకునేందుకు వెళ్ళారు. కొంతసేపు ఆడుకున్న అనంతరం ఇద్దరు పిల్లలు కనిపించలేదు. సాయంత్రం 4 గంటలకు వర్షిక చెరువులోని నీటిపై తేలుతూ కనిపించింది. అటుగా వెళుతున్న వారు చూసి చెరువులోని పాపను బయటకు తీశారు. కుమార్ కోసం నీటిలో వెదకగా అతను చెరువు అడుగు భాగంలో కన్పించాడు. ఇద్దరిని వెంటనే స్థానిక ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా అప్పటికే వారు చనిపోయినట్టు వైద్యులు చెప్పడంతో ఆ కుటుంబం తల్లడిల్లింది.



దుర్మరణంచెందిన అన్నా చెల్లెళ్లు కుమార్, వర్షిక మృతదేహాలు

కుమార్ స్థానిక ప్రైవేట్ స్కూల్లో చదువుతుండగా వర్షిక అంగన్‌వాడీ స్కూల్‌కు వెళ్తోంది. వేసవి సెలవులు కావడంతో ప్రతి రోజూ ఇద్దరు ఇంటి నుంచి బయటకు వెళ్లి ఆడుకుని తిరిగి వచ్చేవారు. సోమవారం యథావిధిగా బయటకు వెళ్లిన పిల్లలిద్దరూ విగతజీవులుగా కనిపించడంతో తల్లిదండ్రుల రోదన చూపరులను కలచివేసింది.

జగన్నాథపురం చెరువులో కూరుకుపోయి బాలుడి మృతి -7లో



శ్రీవారి ఆలయ హుండీల ఆదాయం లెక్కిస్తున్న సిబ్బంది

శ్రీవారి హుండీ ఆదాయం రూ.3.15 కోట్లు

ద్వారకాతిరుమల, జూన్ 3: చిన్నతిరుపతిగా ప్రసిద్ధి చెందిన వేంకటేశ్వర స్వామి ఆలయాల హుండీల లెక్కింపు ద్వారా గడచిన 28 రోజుల కాలానికి రూ.3.15 కోట్ల ఆదాయం సమకూరింది. ప్రమోద కల్యాణ మండప ఆవరణలో సోమవారం అత్యంత భద్రతా ఏర్పాట్ల నడుమ హుండీలను లెక్కించారు. హుండీల ద్వారా రూ.3,15,85,574ల నగదుతో పాటు 234 గ్రాముల బంగారం, 7.650 కేజీల వెండి లభించిన ట్లు ఈఓ వి.త్రినాథరావు తెలిపారు. అలాగే రద్దయిన పాతనోట్లు రూ.500 (27), రూ.వెయ్యి (2), రూ.రెండు వేల నోట్ల(13)తో పాటు పలుదేశాల కరెన్సీని భక్తులు కానుకగా సమర్పించారు.

క్రైం కార్నర్

చీటీ డబ్బులపై భర్తతో ఘర్షణ.. భార్య ఆత్మహత్య

భీమడోలు జూన్ 3: నలింగంపాడు గ్రామానికి చెందిన గోగులమూడి అరుణ జ్యోతి(35)అనే మహిళ సోమవారం తెల్లవారుజామున ఇంట్లో ఉరి వేసుకోగా కుటుంబ సభ్యులు చూసి వెంటనే భీమడోలు ప్రభుత్వాసుపత్రికి తరలించగా అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందింది. భీమడోలు పోలీసుల కథనం ప్రకారం 15 ఏళ్ల క్రితం అరుణ జ్యోతికి వివాహం కాగా ఆమె భర్త మద్యానికి బానిసవ డంతో తరచూ తగాదాలు జరుగుతున్నాయి. ఈ నెల రెండో తేదీన చీటీ డబ్బుల విషయమై భార్యాభర్తల మధ్య ఘర్షణ జరిగింది. సోమవారం తెల్లవారుజామున జ్యోతి ఇంట్లో ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడగా అది చూసిన కుటుంబ సభ్యులు తొలుత భీమడోలు అనంతరం మెరుగైన వైద్యం కోసం ఏలూరు ప్రభుత్వాసుపత్రికి తరలించగా అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందింది. ఈ ఘటనపై ఆమె సోదరుడు శివప్రసాద్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు భీమడోలు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

చెరువులో మునిగి బాలుడి మృతి



మృతదేహంతో గ్రామస్తుల ఆందోళన

తాడేపల్లిగూడెం రూరల్, జూన్ 3: చెరువులో పడి బాలుడు మృతి చెందిన ఘటన జగన్నాథపురంలో జరిగింది. స్థానికులు తెలిపిన వివరాలివి. గ్రామంలో పంచాయతీ చెరువులో చేపలు పట్టేందుకు పెంట పాడుకు చెందిన వారికి కాంట్రాక్టుకు అప్పగించారు. సోమవారం చేపలు పట్టడం పూర్తయిన తరువాత వారిలో ముగ్గురు బాలురు చెరువులో సరదాగా ఆడేందుకు దిగారు. వారిలో రాకేశ్(15) ఊబిలో కూరుకుపోయి ఊపిరాడక కొట్టుకున్నాడు. ఇది చూసిన ఇద్దరు పిల్లలు భయపడి పారిపోయారు. సమాచారం అందించకపోవడంతో రాకేశ్ మృతి చెందాడు. దీంతో బాలుడి మృతదేహంతో బాలుడి తల్లిదండ్రులు ఆందోళనకు దిగారు. తమకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. పంచాయతీ చేపల చెరువు పట్టేందుకు బాలలను కూలికి తీసుకురావడమేంటని ఈ ఘటన తెలిసిన వారు నిలదీస్తున్నారు.

వ్యాన్ ఢీకొని యువకుడి దుర్మరణం



మృతి చెందిన సంతోష్

వేలేరుపాడు, జూన్ 3: మోటార్ సైకిల్‌పై ముగ్గురు యువకులు వెళ్తున్న క్రమంలో వ్యాన్ ఢీకొనడంతో ఒక యువకుడు అక్కడికక్కడే మృతి చెందగా, మరో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. కుక్కునూరు మండలం నెమలి పేటకు చెందిన వర్షా సంతోష్, కటిపల్లి ప్రవీణ్, కంగాల రాము గుబ్బల మంగమ్మ గుడి వద్దకు మోటర్ బైక్‌పై వెళ్తుండగా వేలేరుపాడు మండలం కోయమాధారం గ్రామ శివారులో ఒక వ్యాన్ వెనుక నుంచి ఢీకొనడంతో బైకు నడుపుతున్న వర్షా సంతోష్ రోడ్డుపై పడిపోవడంతో తలకు తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. మిగిలిన ఇద్దరు గాయాలపాల్వడంతో కోయమాధారం గ్రామస్థులు 108కు సమాచారం ఇవ్వగా క్షతగాత్రులను వేలేరుపాడు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. గాయపడిన ప్రవీణ్, రాములకు ప్రథమ చికిత్స చేసిన అనంతరం మెరుగైన వైద్యం కోసం జంగారెడ్డిగూడెం ఏరియా ఆసుపత్రికి తరలించారు. ఈ ప్రమాదం పై మృతుని తండ్రి నాగేశ్వరరావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు వేలేరుపాడు ఎస్‌ఐ లక్ష్మీనారాయణ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

విద్యుదాఘాతానికి యువకుడి మృతి

తాడేపల్లిగూడెం రూరల్, జూన్ 3: విద్యుత్తు షాక్‌కు గురై యువకుడు మృతి చెందిన ఘటన ఉప్పరగూడెంలో సోమవారం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాలివి. ఉప్పరగూడెంకు చెందిన రాపాక బాలు (27) ఇంటర్ పూర్తిచేసి గ్రామంలోనే కిళ్లీ షాపు నడుపుకుంటున్నాడు. సోమవారం సాయంత్రం కోడిగుడ్ల లారీకి తగిలి కేబుల్ వైరు కట్ అయింది. దానిని పక్కకు లాగుదామని బాలు ఆ వైరును పట్టుకోవడంతో కేబుల్ వైరుకు మరో పక్క హైటెన్షన్ వైర్లు తగలడంతో షాక్‌కు గురయ్యాడు. స్థానికులు సపర్య లు చేసి ఆటోలో ప్రైవేటు ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందాడు.

90 లీటర్ల సారా స్వాధీనం

పోలవరం, జూన్ 3 : ఓట్ల లెక్కింపు నేపథ్యంలో పోలీసులు, ఎస్‌ఈబీ అధికారులు మండలంలో పలుచోట్ల దాడులు జరిపి 90 లీటర్ల సారా, 20 మద్యం బాటిళ్లు స్వాధీనం చేసుకుని, 400 లీటర్ల బెల్లపు ఊటను ధ్వంసం చేసినట్లు పోలవరం ఎస్‌ఐ పవన్ కుమార్, ఎస్‌ఈబీ సీఐ కోలా వీరబాబు తెలిపారు. వింజరం పంచాయతీ తానాలకుంటలో బైకుపై సారా తరలిస్తున్న మడకం వరప్రసాద్‌ని అరెస్టు చేసి బైకు సారా స్వాధీనం చేసుకున్నట్లు ఎస్‌ఐ చెప్పారు. పోలవరానికి చెందిన బి.సూర్యప్రకాశం వద్ద 30 లీటర్ల సారా, యడ్ల మధుకిరణ్ నుంచి 20 మద్యం బాటిళ్లు, బైకు స్వాధీనం చేసుకుని, ఎల్లండిపేట గ్రామ శివారున సారా తయారీ కేంద్రంపై దాడి చేసి 10 లీటర్ల సారా స్వాధీనం చేసుకుని 400 లీటర్ల బెల్లపు ఊటను ధ్వంసం చేసి తూర్పు గోదావరి జిల్లా గోపాలపురం మండలం బుచ్చియ్యపాలెం గ్రామానికి చెందిన ముద్దరబోయిన శ్రీను అనే వ్యక్తిని అరెస్టు చేసి కేసులు నమోదు చేశామన్నారు. ముద్దాయిలను కోర్టుకు హాజరు పరుస్తామని ఎస్‌ఈబీ సీఐ వీరబాబు తెలిపారు.

కోడి పందేల్లో 15 మంది అరెస్ట్



పోలీసులు అరెస్టు చేసిన నిందితులు స్వాధీనం చేసుకున్న బైక్‌లు

ఏలూరు క్రైం, జూన్ 3 : ఏలూరు రూరల్ మండలం పోణంగి సబ్‌స్టేషన్ వద్ద సోమవారం ఉదయం కోడి పందేలు నిర్వహిస్తు న్నట్లు ఏలూరు వన్‌టౌన్ సీఐ ఎస్ రాజశేఖర్‌కు సమాచారం అందింది. ఆయన ఆదేశాల మేరకు వన్ టౌన్ ఎస్‌ఐ నవీన్ తన సిబ్బందితో సోమవారం ఉదయం దాడి చేశారు. అక్కడ కోడిపందేలు ఆడుతున్న 15 మందిని అరెస్టు చేసి రూ.30 వేల నగదు, ఒక కోడి, 15 బైక్‌లను స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

లారీని ఢీకొట్టిన ట్రావెల్స్ బస్సు : ఒకరి మృతి

చిట్యాలరూరల్, జూన్ 3 :జాతీయ రహదారిపై వెళుతున్న ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు లారీని ఢీకొన్న ఘటనలో ఒకరు మృతి చెందగా మరొకరికి గాయాలయ్యాయి. నల్లగొండ జిల్లా చిట్యాల మండలం గుండ్రాంపల్లి శివారులో ఆదివారం అర్ధరాత్రి జరిగింది. చిట్యాల ఎస్‌ఐ-2 లింగయ్య తెలిపిన వివరాలి. కైకలూరు మండలం భుజబలపట్నంకి చెందిన ఆగు సోమల కుటుంబరావు (42) హైదరాబాద్‌లోని కోమలి ట్రావెల్స్‌లో బస్సు క్లీనర్‌గా పనిచేస్తున్నాడు. ఈ నెల 2వ తేదీన రాత్రి హైదరాబాద్‌లోని బీహెచ్‌ఈఎల్ నుంచి విజయవాడకు ప్రయాణికులతో వెళ్తున్న కోమలి ట్రావెల్స్ బస్సు అర్ధరాత్రి దాటాక గుండ్రాంపల్లి శివారులో పెట్రోల్ బంకు నుంచి లారీ వేగంగా రోడ్డు మీదకు రావడంతో బస్సు అదుపుతప్పి లారీని వెనుక నుంచి ఢీకొట్టింది. దీంతో బస్సులో ఉన్న కుటుంబరావుతో పాటు డ్రైవర్ మణికంఠకు గాయాలయ్యాయి. బస్సులోనే ఉన్న మరో డ్రైవర్ నాగేంద్రవరప్రసాద్ ఇద్దరిని చికిత్స నిమిత్తం చౌటుప్పల్‌లోని ప్రభుత్వాసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో కుటుంబరావు మృతి చెందాడు. కుటుంబరావు భార్య సంధ్యారాణి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్‌ఐ లింగయ్య పేర్కొన్నారు.

కాయ్ రాజా కాయ్

- దెందులూరులో దడ పుట్టిస్తున్న పందెంరాయుళ్లు
- చింతమనేని గెలుస్తారని 5 రెట్లు..
- ఎంపీ అభ్యర్థి పుట్టా మహేశ్ గెలుపుపై మూడు రెట్లకు సై
- ఏలూరు జిల్లాలో వైసీపీకి రెండు కూడా రావని పందేలు

దెందులూరు, జూన్ 3 : కౌంటింగ్ వేళ దెందులూరు నియోజకవర్గంలో పందేలు దడ పుట్టిస్తున్నాయి. టీడీపీ అభ్యర్థి చింతమనేని ప్రభాకర్ గెలుపు ఖాయమని ఒకటికి ఐదు రెట్లు పందెం కాయడం చర్చనీయాంశంగా మారింది. టీడీపీ నేతలు రూ.ఐదు లక్షలు పందెం కాయగా వైసీపీ నాయకులు రూ.లక్ష పందెం కాశారు. మండలంలోని పెరుగుగూడెం, గోపన్నపాలెం, గాలాయగూడెం, చల్లచింతలపూడి, రామారావుగూడెం, మేదినరావుపాలెం, దెందులూరు, శ్రీరామవరంతోపాటు దాదాపు అన్ని గ్రామాల్లో టీడీపీ గెలుస్తుందని, చింతమనేని గెలుస్తారంటూ హెచ్చు పందేలు పెద్ద ఎత్తున సోమవారం సాయంత్రం వరకు కాశారు. ఒక మెట్ట గ్రామంలో యువనేత చేతిలో డబ్బు లేకపోవడంతో తనకు చెందిన ఒక ఎకరం పట్టదారు పాసు పుస్తకాన్ని తనఖా పెట్టి రూ.మూడు లక్షలు తీసుకుని చింతమనేని గెలుపుపై పందెం కాశారు. ప్రతి గ్రామంలో చిన్నస్థాయి కార్యకర్తలు సైతం రూ.పది వేల నుంచి రూ.10 లక్షల వరకు పందేలు కాస్తున్నారు.

పెదవేగి మండలంలో టీడీపీకి మెజార్టీ వస్తుందని కొందరు, దెందులూరు మండలంలో టీడీపీకి 1500 మెజార్టీ వస్తుందని ఇంకొందరు, ఐదు వేల ఓట్లతో వైసీపీ ఎమ్మెల్యే అభ్యర్థి అబ్బయ్యచౌదరి గెలుస్తారని మరికొందరు పందేలు వేశారు. ఇంత పెద్ద స్థాయిలో కాయడం గతంలో ఎప్పుడు జరగలేదు. సర్వేలతో తమకు పని లేదు, ఎమ్మెల్యేగా చింతమనేని, ఏలూరు ఎంపీగా పుట్టా మహేశ్‌యాదవ్, సీఎంగా చంద్రబాబు గెలుపు ఖాయమంటూ టీడీపీ తరపున పందెం కాసేవారు గెలుపుపై ధీమాతో వైసీపీ తరపున పందెం కాసేవారికి ముందస్తుగానే ఫోన్ పే ద్వారా నగదు బదిలీ చేసి సవాల్ విసరడం గమనార్హం.



కమీషన్‌రాయుళ్లకు పండుగ

ఉంగుటూరు : కాదేదీ పందేనికనర్హం అంటూ క్రికెట్ బుకీలు సంబర పడుతున్నారు. ఐపీఎల్ క్రికెట్ పోటీలు ముగియడంతో బుకీల కన్ను ఎన్నికల ఫలితాలపై పడింది. ఎక్కడికక్కడ పందేలకు తెర తీశారు. పిఠాపురం నుంచి పవన్ కల్యాణ్ గెలుపుపై, సీఎం ఎవరవుతారనే విషయమై బెట్టింగ్ రాయుళ్లు పందేలు కాయిస్తున్నారు. పందెం రాయుళ్ల తొలుత సమ పందేలు, పోలింగ్ సరళిని చూసి ఒకటికి ఒకటిన్నర పందేలతోపాటు మూడు రెట్ల పందేలు జరిగాయి. కొందరు ఐదు శాతం కమిషన్ ప్రాతిపదికన పందెంరాయుళ్ల నుంచి వసూలు చేస్తున్నారు. కైకరం, ఉంగుటూరు, నారాయణపురం తదితర గ్రామాల్లోని పందెం రాయుళ్లంతా బుకీలు ఉండడంతో తీవ్ర ఉత్కంఠ నెలకొంది. కైకరంలో ఒక ప్రజా ప్రతినిధి వైసీపీ గెలుస్తుందని భారీ మొత్తంలో పందెం కాయడంతో అందరూ ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు. అక్కుపల్లి గోకవరంలో ఒకవ్యక్తి పెద్దఎత్తున కమిషన్ ప్రాతిపదికన పందేలను స్వీకరించినట్లు తెలిసింది.

బాబుపై 3 లక్షలు.. జగన్‌పై లక్ష

పెదవేగి : సార్వత్రిక ఎన్నికల ఓట్ల లెక్కింపునకు ఒక్కరోజు సమయం మాత్రమే ఉండడంతో బెట్టింగ్ రాయుళ్లు మరింత జోష్‌తో పందేలకు ఎగబడుతున్నారు. పందేల కోసం ఒకటికి రెండు అంటూ ఆఫర్లను ప్రకటిస్తున్నారు. నిన్నటి వరకు ఒక ఎత్తు కాగా, ఓట్ల లెక్కింపునకు ఒక రోజు ముందు పందెలరాయుళ్ల మరింత స్పీడు పెంచి పందెం కోసం కవ్విస్తున్నారు. మీ పార్టీ గెలుస్తుందనే నమ్మకం ఉన్నప్పుడు పందేలు కాయండి అంటూ ప్రత్యర్థులు పందేలు కాసేలా రెచ్చగొడుతున్నారు. దీంతో పందేలు ఒడ్డడానికి కొంతమంది సిద్ధపడుతున్నారు. సోమవారం జరిగిన పందేల్లో సీఎంగా చంద్రబాబునాయుడు అవుతారని ఒక వర్గం రూ.3 లక్షలు కాయగా జగన్ సీఎం అవుతారని వేరొక వర్గం రూ.లక్షగా పందేలు జోరుగా సాగాయి. దీంతోపాటు స్థానిక ఎమ్మెల్యే అభ్యర్థి గెలుపుపైనా పందేలు ముమ్మరంగా సాగాయి. పందేల సొమ్మును మధ్యవర్తి దగ్గర పెట్టినందుకు మధ్యవర్తికి పందెం సొమ్ములో ఐదు శాతం ఇచ్చేలా ఒప్పందాలు జరుగుతున్నాయి.

సాఫ్ట్‌వేర్ ఉద్యోగుల మక్కువ

గణపవరం : ఇంకా తెల్లవారలేదే... ఈ చీకటి విడిపోలేదే అంటూ ఈ నెల 4వ తేదీ ఓట్ల లెక్కింపులో గెలుపెవరిది అంటూ సర్వత్రా ఉత్కంఠ నెలకొంది. ఫలితాలపై అందరి దృష్టి మళ్లింది. అభ్యర్థులతో పాటు పందెంరాయుళ్లతో సహా విడని ఉత్కంఠ చోటు చేసుకుంది. టీడీపీ కూటమి అధికారంలోకి వస్తుందని వైసీపీ అధికారంలోకి వస్తుందని మరికొందరూ అంతిమ దశలో పందేలు కాయడం విశేషం. హైదరాబాదు, బెంగళూరు, చెన్నై, పుణె తదితర నగరాల్లో స్థిరపడిన సాఫ్ట్‌వేర్ ఉద్యోగులు అధికంగా పందేలు కాస్తున్నారు. ముఖ్యంగా విదేశాల్లో ఉన్న సాఫ్ట్‌వేర్ ఉద్యోగులు ఎన్నడూ లేని విధంగా ఈసారి ఇక్కడ తమ బంధువులకు ఫోన్ చేసి పందేలకు వైసీపీ వాళ్లు ఎవరైనా ఉన్నారా? అంటూ ఆరా తీస్తున్నారు. రాష్ట్రం, జిల్లాల్లో, వైసీపీకి ఎన్ని సీట్లు వస్తాయని ఆరా తీస్తున్నారు. మంగళవారం ఈ ఉత్కంఠకు తెరపడనుంది.

కూటమి గెలుపుపై పూజలు

కూటమి అభ్యర్థులు విజయం సాధించి చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రి కావాలని కోరుతూ టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలు పలు ఆలయాలలో పూజలు చేశారు. ఐదేళ్ల జగన్ పాలనలో రాష్ట్రం దివాలా తీసిందని, నిరుద్యోగం పెరిగిపోయిందని చంద్రబాబు ముఖ్యమంత్రి అయితేనే రాష్ట్రం తిరిగి అభివృద్ధి దిశగా పయనించి ప్రజలు సుభిక్షంగా ఉంటారని వారు దేవుళ్లకు విన్నపాలు చేసుకుంటూ మొక్కులు చెల్లించుకుంటున్నారు.



సోమేశ్వరస్వామికి కొబ్బరి కాయలు కొడుతున్న నాయకులు

భీమవరం టౌన్, జూన్ 3 : నరసాపురం ఎంపీతో పాటు ఏడు అసెంబ్లీ నియోజకవర్గాలలో కూటమి అభ్యర్థులు విజయం సాధించాలని కోరుతూ టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు సోమవారం గునుపూడి పంచారామక్షేత్రమైన ఉమాసోమేశ్వర, జనార్దనస్వామి దేవస్థానంలోని సోమేశ్వరస్వామికి 108 కొబ్బరి కాయలు కొట్టి అభిషేకాలు చేయించారు. సీఎంగా చంద్రబాబు నాయుడు, 21 సీట్లతో పవన్ కల్యాణ్ అత్యధిక మెజార్టీలతో విజయం సాధించాలని, పులపర్తి రామాంజనేయులు (అంజిబాబు) మంత్రి కావాలని పూజలు చేశారు. చెరుకూరు రామకృష్ణచౌదరి ఆధ్వర్యంలో జిల్లా గౌడ్ సంఘం అధ్యక్షుడు వీరమల్లు సూరిబాబు, తెలుగుదేశం పార్టీ రాష్ట్ర యువత కార్యదర్శి పండు, నియోజకవర్గం తెలుగు యువత కార్యదర్శి కాసాని రామాంజనేయులు, గునుపూడి లాయర్ శ్రీను, రెడ్డి సత్తిబాబు, పెద్ది రాజు, చినరంగనిపాలెం సోమరాజు, యూత్ సభ్యులు వీరమల్లు వెంకట్, తదితరులు పాల్గొన్నారు



- ఏలూరు కార్పొరేషన్ : ఓట్ల లెక్కింపు నేపథ్యంలో కూటమి ఏలూరు నియోజకవర్గం టీడీపీ అభ్యర్థి బడేటి వెంకట్రామయ్య(చంటి) అనుచర బృందంతో వెళ్లి పవరుపేటలోని విజయ గణపతి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామివారికి గరికతో అర్చనలు జరిపి బెల్లం నివేదనలు సమర్పించారు. ఎన్నికల్లో విజయం చేకూర్చాలంటూ చంటి, అనుచర బృందం స్వామివారిని ఆరాధించారు. టీడీపీ, బీజేపీ, జనసేన నాయకులు, కార్యకర్తలు చంటి వెంట ఉన్నారు.



విజయగణపతి స్వామికి పూజలు చేస్తున్న చంటి, పరింపూడి అర్లమ్మ ఆలయంలో పూజలు చేస్తున్న మహిళలు



కాలినడకన చినతిరుపతి వెళ్తున్న నాయకులు

- తాడేపల్లిగూడెం రూరల్ : కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి బొలిశెట్టి శ్రీనివాస్, రాష్ట్రంలో కూటమి గెలుపును కాంక్షిస్తూ కడియద్ద కూటమి నాయకులు కాలినడకన చిన్నతిరుపతి వెళ్లారు. వీరిని జనసేన, టీడీపీ నాయకులు బొలిశెట్టి రాజేష్, తోట రాజా అభినందించారు. టీడీపీ, జనసేన, బీజేపీ గ్రామ నాయకులు పాల్గొన్నారు.
- కొయ్యలగూడెం : కూటమి ప్రభుత్వం ఏర్పాటు ఖాయమని తెలుగు మహిళా రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి గంగిరెడ్ల మేఘలాదేవి అన్నారు. పరింపూడి రామాలయం, అర్లమ్మ ఆలయం వద్ద ప్రత్యేక పూజలు చేశారు. ఎన్నికల ఫలితాలు కూటమికి అనుకూలంగా రావాలంటూ పూజలు చేసినట్లు ఆమె తెలిపారు. టీడీపీ నాయకులు రమా, సిర్రా ఉమా, కర్రి లక్ష్మీదేవి, సూరి భార్గవి, తదితరులు ఉన్నారు.

ఉత్తమ ప్రదర్శనగా ఇంద్ర ప్రస్థం

ముగిసిన నాటిక పోటీలు



ఉత్తమ ప్రదర్శన 'ఇంద్ర ప్రస్థానం' నాటికకు బహుమతి అందజేస్తున్న సభ్యులు

భీమవరం అర్బన్, మే 3: చైతన్య భారతి సంగీత నృత్య నాటక పరిషత్ జాతీయ స్థాయిలో నిర్వహించిన నాటిక పోటీల్లో అభినయ ఆర్ట్స్ గుంటూరు వారి 'ఇంద్రప్రస్థం' నాటిక ఉత్తమ ప్రదర్శనగా ఎంపిక కాగా, తెలుగు కళా సమితి విశాఖపట్నం వారి 'నిశ్శబ్దమా నీ ఖరీదెంత' ద్వితీయ స్థానం, చైతన్య కళాభారతి కరీంనగర్ వారి 'స్వప్నం రాల్చిన అమృతం' నాటిక తృతీయ స్థానం సాధించాయని చైతన్య భారతి అధ్యక్షుడు రాయప్రోలు భగవాన్ తెలిపారు. జ్యూరీ ప్రదర్శనగా కళాంజలి హైదరాబాద్ వారి రైతే రాజు', ఉత్తమ రచన 'మూల్యం' రచయిత సింహ ప్రసాద్, ఉత్తమ దర్శకత్వం ఎస్.రవీంద్ర రెడ్డి, ఉత్త నటుడు కుమార్ పాత్రదారి సి.వరప్రసాద్ (నిశ్శబ్దమా నీ ఖరీదెంత), ఉత్తమ నటి చుక్కమ్మ పాత్రదారిణి నాగ రాణి(విముక్తి), ఉత్తమ ప్రతి నాయకురాలుగా సరిత (ఎనిమి), ఉత్తమ హాస్యనటుడిగా వి.సురేష్ (ఎనిమి), ఉత్తమ క్యారెక్టర్ ఆర్టిస్ట్‌గా కె.సూర్యనారాయణ (స్వప్నం రాల్చిన అమృతం) ఉత్తమ క్యారెక్టర్ నటిగా వసంత యామిని (మనస్విని), సంగీతం (ఇంద్ర ప్రస్థం) ఉత్తమ మేకప్ మనస్విని, ఉత్తమ లైటింగ్ కౌసల్య సుప్రజ రామా, జ్యూరి బహుమతి శ్రావ్య, కావ్య (ఎనిమి) సాయి, సుప్రీయ (స్వప్నం రాల్చిన అమృతం)కు అందించామని వివరించారు. ఈ కార్యక్రమంలో రాయప్రోలు భగవాన్, శ్రీనివాస మూర్తి, కట్రేడ్డి సత్యనారాయణ, భట్టిప్రోలు శ్రీనివాసరావు, బోండా రాంబాబు, పేరిచర్ల లక్ష్మణ వర్మ, కాగిత వేంకటరమణ, బీశెట్టి జ్యోతిరాజ్, నడింపల్లి మహేష్, న్యాయ నిర్ణేతలుగా మానాపురం సత్యనారాయణ, డాక్టర్ ఎన్‌వీ కృష్ణారావు, పంపన దయానంద బాబు వ్యవహరించారు.

'భవిష్యత్ త్రీడీ ప్రింటింగ్ టెక్నాలజీ దే'



కార్యక్రమంలో మాట్లాడుతున్న ఆచార్యులు

తాడేపల్లిగూడెం అర్బన్, జూన్ 3 : భవిష్యత్ త్రీడీ ప్రింటింగ్ టెక్నాలజీ దేనని ఏపీ నిట్ రిజిస్ట్రార్ డాక్టర్ పి.దినేష్‌శంకర్‌రెడ్డి అన్నారు. ఏపీ నిట్‌లోని మెకానికల్ ఇంజనీరింగ్ విభాగం ఆధ్వర్యంలో త్రీడి ప్రింటింగ్ టెక్నాలజీ పై 8, 9, 10 తరగతి విద్యార్థులకు ఐదు రోజుల పాటు నిర్వహించనున్న శిక్షణ కార్యక్రమాన్ని సోమవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా దినేష్‌శంకర్‌రెడ్డి మాట్లాడుతూ ప్రపంచంలో అత్యంత వేగంగా విస్తరిస్తున్న రంగాలలో త్రీడి ప్రింటింగ్ ఒకటన్నారు. ఈ టెక్నాలజీని ఉపయోగించి వివిధ రకాల నాణ్యమైన వస్తువులు, బొమ్మలు, భవనాలు, వంతెనల వంటివి నచ్చిన డిజైన్లలో ఎంతో ఆకర్షణీయంగా రూపకల్పన చేయవచ్చన్నారు. విద్యార్థులు త్రీడీ ప్రింటింగ్ టెక్నాలజీపై నైపుణ్యాలను పెంపొందించుకుని అంకుర పరిశ్రమలను ఏర్పాటు చేసే స్థాయికి ఎదగాలన్నారు. పోటీ ప్రపంచంలో రాణించాలంటే విద్యార్థులు పాఠశాల స్థాయి నుంచి స్టెమ్(సైన్స్, టెక్నాలజీ, ఇంజనీరింగ్, మ్యాథమెటిక్స్) కోర్సులపై పట్టు సాధించడంతో పాటు అన్ని రంగాలపై అవగాహన పెంచుకోవాలన్నారు. డీన్ స్టూడెంట్ వెల్ఫేర్ డాక్టర్ జీబీ వీరేష్‌కుమార్, మెకానికల్ ఇంజనీరింగ్ విభాగాధిపతి డాక్టర్ టి.బాబూరావు మాట్లాడుతూ విద్యార్థులు త్రీడీ ప్రింటింగ్ అప్లికేషన్లు, మెళకువలు తెలుసుకోవాలన్నారు. కార్యక్రమానికి కో ఆర్డినేటర్‌గా డాక్టర్ టి.కార్తికేయశర్మ వ్యవహరించగా, ఆచార్యులు డాక్టర్ వి.సందీప్, డాక్టర్ పి.శంకర్, విద్యార్థులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న ఆక్రమణల తొలగింపు



బస్టాండ్‌లో తొలగిస్తున్న అక్రమణలు

పాలకొల్లు అర్బన్, జూన్ 3 : బస్టాండ్ రోడ్డులోనూ బస్టాండ్ చేర్చి ఉన్న మున్సిపల్ కాంప్లెక్స్ ముందు చేప ట్టిన డ్రైనేజీలపై అక్రమణలను మూడో రోజు సోమవారం కూడా తొలగింపు కొనసాగించారు. చిన్నపాటి వర్షానికే బస్టాండ్ ఆవరణ మునిగిపోయి ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్న నేపథ్యంలో మున్సిపల్ అధికారులు ఈ చర్యలు తీసుకున్నారు. తమకు సమయం ఇవ్వకుండా అధికారులు చేపట్టిన అక్రమణల తొలగింపుతో తాము వ్యాపారాలు కోల్పోవడంతో తీవ్రంగా నష్టపోతున్నామని షాపింగ్ కాంప్లెక్ వ్యాపారులు వాపోతున్నారు. మున్సిపల్ కమిషనర్ విజయసారధి ఆదేశాలతో ఆర్‌ఐ శ్రీనివాసరాజు, టీపీవో బ్రహ్మం, టీపీఎస్ త్రినాధరావు సిబ్బంది అక్రమణలు తొలగించే కార్యక్రమాన్ని పర్యవేక్షించారు.

తాళాలు పగులగొట్టి ఇంట్లో చోరీ

పెదవేగి, జూన్ 3 : ఇంటికి తాళం వేసి, ఊరువెళ్లి వచ్చేసరికి తాళాలు పగులగొట్టి దొంగతనానికి పాల్పడ్డారు. పెదవేగి ఎస్‌ఐ వి.రాజేంద్రప్రసాద్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. భోగాపురం శివారు ప్రకాష్‌నగర్(వైర్లు)కు చెందిన గాదిరాజు గంగరాజు వారం రోజుల కిందట ఇంటికి తాళం వేసి, కుటుంబ సభ్యులతో కలిసి గ్రామాంతరం వెళ్లారు. తిరిగి సోమవారం ఉదయం వచ్చేసరికి ఇంటి తాళాలు పగులగొట్టి ఉన్నాయి. ఇంట్లో పరిశీలించగా బీరువాలోని 15 కాసుల బంగారు ఆభరణాలు, రూ.50 వేల నగదు అపహరణకు గురయ్యాయి. దీనిపై బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు ఆధారంగా కేసు నమోదు చేశామని, క్లూస్ టీమ్‌తో ఆధారాలు సేకరించామని ఎస్‌ఐ చెప్పారు.

యువకుడిపై కేసు నమోదు

ఏలూరు క్రైం, జూన్ 3 : నిద్రిస్తున్న ఒక మహిళతో అసభ్యంగా ప్రవర్తించిన ఒక యువకుడిపై కేసు నమోదైంది. ఏలూరులోని ఒక ప్రాంతానికి చెందిన మహిళ (52) సోమవారం రాత్రి ఇంట్లో నిద్రిస్తుంది. ఏలూరు బంగారునాగన్న వీధికి చెందిన బంగారు విద్యాసాగర్ అనే యువకుడు అర్ధరాత్రి ఇంట్లోకి ప్రవేశించి ఆ మహిళతో అసభ్యంగా ప్రవర్తించాడు. బాధితురాలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఏలూరు టూ టౌన్ పోలీసులు ఆ యువకుడిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఆక్వాకు విద్యుత్ షాక్

- ఏరియేటర్లు పని చేయక ఆక్సిజన్ లోపం
- రొయ్యల మృత్యువాత
- లక్షల్లో నష్టం.. జనరేటర్ల ఏర్పాటుతో అదనపు భారం

కలిదిండి, జూన్ 3 : ఆక్వా సాగు రైతులకు భారంగా మారుతోంది. ఒకవైపు వాతావరణం అనుకూలించకపోవడం, మరో వైపు అప్రకటిత విద్యుత్ కోతలతో రొయ్యలు, చేపలు మృత్యువాత పడుతుండడంతో లక్షలాది రూపాయలు నష్టపోతున్నారు. వాతావరణంలో మార్పులతో చిరుజల్లు పడడంతోపాటు ఉక్కబోతతో చెరువుల్లో ఆక్సిజన్ లోపిస్తోంది. ఇలాంటి పరిస్థితుల్లో చెరువుల్లో నిరంతరాయంగా ఏరియేటర్లు తిరుగుతూనే ఉండాలి. అయితే గంటల తరబడి విద్యుత్ కోతల కారణంగా ఏరియేటర్లు పని చేయక చెరువుల్లో ఆక్సిజన్ లోపించి రొయ్యలు మృత్యువాత పడడంతో లక్షలాది రూపాయలు నష్టం వాటిల్లుతుందని రైతులు ఆందోళన చెందుతున్నారు. ప్రత్యామ్నాయంగా జనరేటర్లు అద్దెకు ఏర్పాటు చేసుకోవడానికి రైతులందరూ ఎగబడటంతో వాటికి డిమాండ్ పెరిగింది. రాత్రి వేళల్లో విద్యుత్ కోత విధిస్తుండడంతో చెరువుల వద్ద అద్దె జనరేటర్లు ఏర్పాటు చేసి ఏరియేటర్లను తిప్పుతున్నారు. పండుగప్ప చెరువుల్లో కూడా ఆక్సిజన్ కొరత ఏర్పడకుండా నిరంతరాయంగా ఏరియేటర్లు తిప్పుతున్నారు. ఆక్సిజన్ లోపిస్తే పండుగప్ప చనిపోయే ప్రమాదముంది. మట్టగుంటలో ఇటీవల సుమారు ఏడేకరాల చెరువుల్లో ఆక్సిజన్ లోపించి పండుగప్పలు మృత్యువాత పడడంతో రైతులకు రూ.70 లక్షల నష్టం వాటిల్లింది. అలాగే పెదలంకలో ఓ రైతుకు చెందిన ఐదేకరాల చెరువులో ఆక్సిజన్ కొరత ఏర్పడి వనామి రొయ్యలు చనిపోవడంతో రూ.10 లక్షలు నష్టం వచ్చింది. కరెంట్ ఎప్పుడు ఉంటుందో తెలియని పరిస్థితి ఉండడంతో రేయింబవళ్లు చేపలు, రొయ్యల చెరువుల వద్ద ఆక్వా రైతులు కాపల ఉంటున్నారు. కరెంట్ పోగానే ఏరియేటర్లకు జనరేటర్ కనెక్షన్ ఇస్తున్నారు. చేపల చెరువుల్లో ఆయిలింజన్లను బోటులో అమర్చి తిప్పుతున్నారు. దీంతో చెరువులో కెరటాలు రావడంతో ఆక్సిజన్ ఉత్పన్నమవుతోంది. విద్యుత్ కోత సమయాలను విద్యుత్ శాఖ అధికారులు ప్రకటించాలని పలువురు కోరుతున్నారు.



చేపల చెరువులో తిప్పుతున్న బోటు

సప్లిమెంటరీ పరీక్షలు ప్రశాంతం

ఏలూరు ఎడ్యుకేషన్, జూన్ 3 : పదో తరగతి సప్లిమెంటరీ పరీక్షల్లో భాగంగా సోమవారం జరిగిన ఓఎస్‌ఎస్‌సీ సంస్కృతం పేపర్-2 పరీక్షకు జిల్లాలో 17 మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకోగా 15 మంది హాజరయ్యారని డీఈవో అబ్రహం సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పరీక్షతో సప్లిమెంటరీ పరీక్షలు పూర్తిగా ముగిశాయని, జిల్లాలో ఎక్కడా మాల్‌ప్రాక్టీస్ కేసులు నమోదు కాలేదన్నారు.

దూరవిద్య సప్లిమెంటరీ పరీక్షకు 19 మంది గైర్హాజరు

ఏపీ ఓపెన్ స్కూల్స్ దూరవిద్య సప్లిమెంటరీ పరీక్షల్లో భాగంగా సోమవారం జరిగిన ఇంటర్మీడియట్ జీవశాస్త్రం పరీక్షలకు జిల్లాలో 100 మంది, వాణిజ్యశాస్త్రం పరీక్షకు 148 మంది విద్యార్థులు హాజరయ్యారని డీఈవో తెలిపారు. మొత్తం 19 మంది గైర్హాజరయ్యారని వివరించారు. పరీక్షలు ప్రశాంతంగా జరిగాయన్నారు.

అకడమిక్ భవనం పరిశీలన

నూజివీడు, జూన్ 3: నూజివీడు ఎమ్మార్ అప్పారావు కాలేజ్ ఆఫ్ పీజీ స్టడీస్‌లో నూతనంగా నిర్మాణంలో ఉన్న అకడమిక్ భవనాన్ని కృష్ణా వర్సిటీ వీసీ ప్రొఫెసర్ జ్ఞానమణి, ఎడ్యుకేషన్, వెల్ఫేర్, ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఎండీ దివాన్‌రెడ్డి సోమవారం పరిశీలించారు.



బందోబస్తును పరిశీలిస్తున్న ఎస్పీ మేరీ ప్రశాంతి

బందోబస్తు రిహార్సల్

ఓట్ల లెక్కింపు కేంద్రాల వద్ద సిబ్బందికి ఎస్పీ సూచన

ఏలూరు క్రైం, జూన్ 3: ఓట్ల లెక్కింపు కేంద్రమైన సీఆర్‌ఆర్ ఇంజనీరింగ్ కళాశాల వద్ద పోలీసు బందోబస్తుపై సోమవారం రిహార్సల్ నిర్వహించారు. పోలీస్ సిబ్బంది ఎక్కడెక్కడ ఉండాలి, ఏజెంట్లు, అభ్యర్థులను తనిఖీ చేయడం, వాహనాల పార్కింగ్ వంటి అంశాలను ఎస్పీ మేరీ ప్రశాంతి స్వయంగా పరిశీలించి పలు సూచనలు చేశారు. ఎస్పీతో పాటు అవినీతి నిరోధకశాఖ జాయింట్ డైరెక్టర్ సుప్రజ, జిల్లా అదనపు ఎస్పీ జి స్వరూపరాణి, డీఎస్పీలు పాల్గొన్నారు.

అప్రమత్తంగా విధులు నిర్వర్తించండి

ఓట్ల లెక్కిపు కేంద్రాల పరిసర ప్రాంతాల్లో పోలీసు అధికారులు, సిబ్బంది అప్రమత్తంగా విధులను నిర్వర్తించాలని ఎస్పీ డీ మేరీ ప్రశాంతి ఆదేశించారు. కౌంటింగ్ విధులలో సిబ్బందికి సోమవారం అవగాహన సదస్సు నిర్వహించారు. లెక్కింపు కేంద్రంలో అనుమతి పొందిన ప్రతి ఒక్కరిని క్షుణ్ణంగా తనిఖీ చేసి ఎలక్ట్రానిక్ గాడ్జెట్స్, సెల్‌ఫోన్లు, సిగరెట్లు, ఇతర మండే పదార్థాలను అనుమతించ రాదన్నారు. ఇతర శాఖల సమన్వయంతో విధులను నిర్వర్తించాలన్నారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలన్నారు. లెక్కింపు కేంద్రానికి 200 మీటర్ల బయట వాహనాన్ని తనిఖీ చేసి పంపాలని, 100 మీటర్ల బయట అభ్యర్థులను, ఏజెంట్లను విధులను నిర్వర్తించడానికి వచ్చే ప్రభుత్వ ఉద్యోగులను క్షుణ్ణంగా తనిఖీ చేసి వారి గుర్తింపు కార్డులను పరిశీలించి లోపలికి అనుమతించాలన్నారు. ఎవరైనా కవ్వింపు చర్యలకు పాల్పడితే తక్షణం అదుపులోకి తీసుకుని కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఏలూరు నగరంలో విధులను నిర్వర్తించే పోలీస్ సిబ్బంది ప్రజలు గుంపులుగా చేరకుండా చూడాలని, ఎవరైనా రోడ్లపైకి వస్తుంటే వారిని వెంటనే పంపించి వేయాలన్నారు. ఎలాంటి ఘర్షణలకు తావు లేకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లాలో 144 సెక్షన్, పోలీస్ యాక్టు అమలులో ఉన్నందున నగరంలో దుకాణాలు, హోటళ్లు, రెస్టారెంట్లు, ఇతర వ్యాపార సముదాయాలు, లాడ్జిలు, రిసార్ట్ ఇతర ప్రదేశాల్లో ఎవరు బస చేయడానికి అనుమతి లేదన్నారు. సీఆర్‌ఆర్ కాలేజీ వద్దకు అనుమతి లేని వారు రావద్దని ఎవరైనా వస్తే పంపించి వేయడం జరుగుతుందన్నారు. ఏలూరు నగరంలో ఎక్కడా ఉండడానికి వీలు లేదన్నారు. రాజకీయ పార్టీ, నాయకులు, కార్యకర్తలు, ప్రజలు ఏలూరు నగరంలోకి రావద్దని ఎన్నికల ఫలితాలను టీవీల ద్వారా వీక్షించాలని సూచించారు. ఇతరులను రెచ్చగొట్టే విధంగా, కించపరిచే విధంగా వ్యాఖ్యలు చేయరాదని, ర్యాలీలు, సభలు సమావేశాలు నిర్వహించరాదని సూచించారు.

ప్రభుత్వాసుపత్రి తల్లి బిడ్డల విభాగంలో ఏసీ

ఏలూరు క్రైం, జూన్ 3: ఏలూరు ప్రభుత్వాసుపత్రిలో ఏసీలు లేక గర్భిణులు, పసిపిల్లలు ఉక్కపోతతో ఇబ్బంది పడుతున్నారని పత్రికల్లో వచ్చిన కథనాలతో జిల్లా కలెక్టర్ వెంటనే స్పందించారు. తల్లి బిడ్డల వార్డులలో సోమవారం ఏసీలను ఏర్పాటు చేయించారు. యుద్ధప్రాతిపదికన ఏసీలను ఏర్పాటు చేయించి సమస్య పరిష్కరించిన కలెక్టర్‌కు గర్భిణులు కృతజ్ఞతలు తెలిపారు.

8 నుంచి ఆర్టీసీ బస్‌పాస్‌ల జారీ

ఏలూరు రూరల్, జూన్ 3: ఏలూరు ఆర్టీసీ డిపోలో విద్యార్థులకు సీజన్, స్టూడెంట్ బస్‌పాస్‌లు ఈనెల 8 నుంచి బస్‌పాస్‌లు జారీ చేస్తామని ఏలూరు డిపో మేనేజరు డి.వాణి సోమవారం తెలిపారు. ఈనెల 6, 7 తేదీల్లో సాఫ్ట్‌వేర్‌లో మార్పులు జరుగుతున్నాయన్నారు. ఈ కారణంగా సీజన్ పాస్‌లు, స్టూడెంట్ బస్‌పాస్‌లు ఈ నెల 8 నుంచి యథావిధిగా బస్‌పాస్‌లు అందజేస్తామని తెలిపారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాల్సిందిగా విజ్ఞప్తి చేశారు.

వృద్ధాశ్రమానికి గుర్తు తెలియని వృద్ధురాలి తరలింపు



వృద్ధురాలిని తరలిస్తున్న ఐసీడీఎస్ సిబ్బంది

బుట్టాయగూడెం, జూన్ 3: జంగారెడ్డిగూడెం పట్టణంలో సూపర్ మార్కెట్ ప్రాంతంలో గుర్తు తెలియని వృద్ధురాలికి ఐసీడీఎస్ సిబ్బంది అండగా నిలిచారు. వృద్ధురాలు వీరమ్మ అని పేరు తప్ప ఇతర వివరాలు చెప్పలేకపోతోంది. ఆమె రెండు కాళ్లకు దెబ్బలు తగలడంతో నడవలేని స్థితిలో ఉన్న విషయాన్ని గుర్తించిన సీడీపీవో పి.బ్యూలా, సూపర్‌వైజర్ లక్ష్మి, అంగన్‌వాడీ కార్యకర్తలు లీలా, కృష్ణకుమారి శుక్ర, శని, ఆదివారాలు అంగన్‌వాడీ కేంద్రంలో ఉంచి ఏరియా ఆసుపత్రిలో వైద్య సేవలందించారు. చికిత్స అనంతరం జిల్లా అధికారుల ఆదేశాల మేరకు జీఎంఎస్‌కే. ఎస్తేరు, అంగనవాడీ కార్యకర్తలు, స్థానిక యువకుడు అజయ్ ఆర్థికసాయంతో నిడదవోలు వృద్ధాశ్రమానికి ఆమెను తరలించారు. ఐసీడీఎస్ సిబ్బంది సేవలను పలువురు అభినందించారు.

కాపు సంక్షేమ కోఆర్డినేటర్‌గా శేషు

ఏలూరు టూటౌన్, జూన్ 3: కాపు సంక్షేమ సేవా సంఘ ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా కోఆర్డినేటర్‌గా అమలాపురానికి చెందిన హైకోర్టు న్యాయవాది తోట నాగశేషు నియమితులయ్యారు. వ్యవస్థాపక అధ్యక్షులు శ్రీరాములు సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. రాబోయే రెండు నెలల్లో అన్ని జిల్లాలు, నియోజకవర్గాలు, పట్టణ, నగర మండల, గ్రామ కమిటీలు నియమిస్తామని ఆయన తెలిపారు.



గాలులు.. మబ్బులు

సార్వా సాగుకు రైతులు సన్నద్ధం

ఏలూరు రూరల్, జూన్ 3: నైరుతి రుతు పవనాలు రైతన్నకు చల్లని కబురును మోసుకొచ్చాయి. సార్వా సాగుకు కీలకమైన నైరుతి రుతుపవనాలు రాష్ట్రంలోకి ప్రవేశించాయని వాతావరణశాఖ వెల్లడించింది. సోమవారం ఉదయం నుంచి వాతావరణం ఒక్కసారిగా చల్లబడింది. మండలంలోని రైతులు సార్వా సాగుకు సన్నద్ధమవుతున్నారు. భూగర్భజలాలు అడుగంటి ఉన్న పరిస్థితుల్లో రైతులు, వివిధ వర్గాల ప్రజలకు అనుకున్న సమయంలోనే నైరుతి రుతుపవనాలు దరికి చేరటం సంతోషాన్ని కలిగిస్తోంది. గత ఏడాది సరైన వర్షాలు లేక నష్టపోయారు. ఈ నెలలో సాధారణ వర్షపాతం కంటే అధిక వర్షపాతం నమోదవుతుందని వాతావరణ శాఖ ప్రకటించడంతో రైతుల్లో కొత్త ఆశలు రేకెత్తుతున్నాయి. ముందుగా చిరుజల్లులు, మోస్తరు వర్షాలు ప్రారంభమై భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని అంచనా వేస్తున్నారు. ఎండల తీవ్రత, ఉక్కపోత నుంచి కూడా ప్రజలకు ఉపశమనం లభించింది. అనుకున్న సమయానికి వర్షాలు కురిస్తే రూరల్ మండలంలో వరి సాగు పూర్తిస్థాయిలో జరుగుతుందని వ్యవసాయశాఖ అధికారులు అంచనా వేస్తున్నారు. ఎరువులు, విత్తనాలు అందుబాటులో ఉంచాలని పలువురు రైతులు కోరుతున్నారు. రూరల్ మండలం పాలగూడెంలో పంట కాలువలు పూడిక తొలగించాలని, జాలిపూడి, కాట్లంపూడి, చాటపర్రు, కోటేశ్వర దుర్గాపురంలో సాగుకు పంట కాలువల్లో పూడిక తొలగించాలని రైతులు విజ్ఞప్తి చేస్తున్నారు.

రాత్రి వర్షం.. పగలు ఎండ

పోలవరం: మండలంలో ఆదివారం అర్ధరాత్రి ఈదురు గాలులతో ఓ మోస్తరు వర్షం కురిసింది. గాలులతో విద్యుత్ సరఫరా నిలిపివేశారు. గాలులు తగ్గిన తర్వాత విద్యుత్ సరఫరా పునరుద్ధరించారు. వాతావరణం చల్లబడడంతో ప్రజలు ఉక్కబోత నుంచి ఉపశమనం పొందారు. తిరిగి సోమవారం ఉదయం నుంచి ఎండ తీవ్రత పెరిగింది.



కుక్కునూరు ప్రధాన రహదారిలో పోలీస్ సిబ్బంది



పోలీస్ జాగిలాల పనితీరును పరిశీలిస్తున్న ఎస్పీ మేరీ ప్రశాంతి



లింగపాలెంలో పోలీసు, భద్రతా దళాల పహారా

పటిష్ఠ భద్రత

ఓట్ల లెక్కింపు.. గ్రామాల్లో పోలీసు వలయం

వివాదాలకు తావులేకుండా చర్యలు

సార్వత్రిక ఎన్నికల్లో భాగంగా ఓట్ల లెక్కింపు సందర్భంగా గ్రామాలు, పట్టణాల్లో అవాంఛనీయ సంఘటనలు తలెత్తకుండా పోలీస్ శాఖ పటిష్ఠ చర్యలు చేపట్టింది. జిల్లాలోని అన్ని మండలాల్లో 144 సెక్షన్ అమలులో ఉందని, ఈ నెల 6 వరకు ఎన్నికల కోడ్ అమలులో ఉంటుందని పోలీసు అధికారులు సూచించారు. గ్రామాల్లో గుమిగూడి ఉండడం, ర్యాలీ, ప్రదర్శనలకు అనుమతి లేదని, నిబంధనలు మీరితే కఠిన చర్యలు తప్పవని పోలీసులు మైక్ ద్వారా ప్రచారం చేస్తున్నారు.

బుట్టాయగూడెం, జూన్ 3: ఎన్నికల కోడ్ అమలులో ఉందని, మంగళవారం ఓట్ల లెక్కిపు సందర్భంగా మండల పరిధిలో ఎవరైనా చట్టవ్యతిరేక కార్యకలపాలకు పాల్పడితే చర్యలు తీసుకుంటామని ఎస్సై వెంకన్న హెచ్చరించారు. ఆటోలో మైక్ ద్వారా సోమవారం మండల కేంద్రం, గ్రామాల్లో ప్రచారం చేయించారు. మండలంలో 144 సెక్షన్ అమలులో ఉందని సభలు, సమావేశాలు, ర్యాలీలు, ప్రదర్శనలకు అనుమతి లేదన్నారు. సోషల్ మీడియాలో రెచ్చగొట్టే పోస్టులు పెట్టినా చర్యలు తీసుకుంటామన్నారు. నాయకులు, కార్యకర్తలు పోలీసువారికి సహకరించాలన్నారు.

● లింగపాలెం: ఎన్నికల నిబంధనలు ప్రతిఒక్కరూ పాటించాలని, అవాంఛనీయ సంఘటనలు జరిగితే చర్యలు తప్పవని ఎస్సై వి.చెన్నారావు హెచ్చరించారు. మండలంలోని పలు గ్రామాల్లో ఎస్సై పర్యటించారు. మండలంలో 30 పోలీస్‌యాక్ట్‌తో పాటు 144 సెక్షన్ అమల్లో ఉందన్నారు. మండలంలో సాయుధ దళాలతో గస్తీ ఏర్పాటు చేశామన్నారు. పోలింగ్ సమయంలో అల్లరి సృష్టిస్తే వారిపై రౌడీషీట్లు ఓపెన్ చేస్తామన్నారు.

● టి.నరసాపురం: అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని ఎస్ఐ డి.దుర్గా మహేశ్వరరావు హెచ్చరించారు. మండలంలో 144 సెక్షన్ అమల్లో ఉందని, గుంపులుగా తిరగడం, ర్యాలీ, బాణసంచా పేల్చడం, రోడ్లపై కేక్ కటింగ్ నిషేధించినట్లు ఆయన తెలిపారు.

● ఉంగుటూరు: ఓట్ల లెక్కింపు సందర్భంగా ఎవరూ విపరీత ధోరణి ప్రదర్శించరాదని సీఐ ఎంవీ.సుభాష్ సూచించారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ సంయమనం పాటించి శాంతి భద్రతలను కాపాడాలన్నారు. నిడమర్రు, భీమడోలు, గణపవరం సర్కిళ్లలో ఎన్నికల కోడ్ అమలులో ఉన్నంత వరకు పోలీసులకు సహకరించాలన్నారు.

● కుక్కునూరు: ఓట్ల లెక్కిపు నేపథ్యంలో మండలంలోని పలు ప్రాంతాల్లో పోలీసులు పహారా కాస్తున్నారు. ఫలితాల వెల్లడి అనంతరం అనుమతి లేకుండా విజయోత్సవ ర్యాలీలు, సభలు సమావేశాలు నిర్వహించడానికి వీలులేదని హెచ్చరిస్తున్నారు. బహిరంగ ప్రదేశాల్లో రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేయరాదని సూచించారు. ఎన్నికల నియామవళి అతిక్రమించినట్లు అయితే వారిపై చర్యలు తీసుకుంటామని సీఐ శ్రీనివాసరావు హెచ్చరించారు.

● పెదవేగి: ప్రతిఒక్కరూ ఎన్నికల నిబంధనలు కచ్చితంగా పాటించాలని ఎస్ఐ వి.రాజేంద్రప్రసాద్ సూచించారు. ప్రశాంతతకు భంగం కలిగించకుండా జాగ్రత్తగా ఉండాలని ఆయన చెప్పారు. ఎన్నికల సమయంలో కేసులు నమోదైతే భవిష్యత్‌ను నాశనం చేస్తుందని, యువతకు ఉద్యోగ అవకాశాల సమయంలో అది అడ్డంకిగా మారుతుందన్నారు. ఫలితాలు వెల్లడి తర్వాత రోడ్లపైకి వచ్చి, బాణసంచా కాల్చుతూ సంబరాలు జరపడానికి అనుమతిలేదని, అలా చేస్తే కేసులు నమోదు చేస్తామని తెలిపారు. మద్యం అక్రమ విక్రయాలపై కఠిన చర్యలు తప్పవన్నారు. శాంతిభద్రతల పరిరక్షణలో ప్రజల సహకారమే కీలకమని, దీన్ని దృష్టిలో పెట్టుకుని ప్రజల సంపూర్ణ సహాయ సహకారాలు అందించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

● మూతపడిన మద్యం షాపులు

బుట్టాయగూడెం: ఓట్ల లెక్కింపు సందర్భంగా మండలంలోని బుట్టాయగూడెం, రామారావుపేట సెంటరు, నందాపురం ప్రాంతాల్లోని మద్యం దుకాణాలు సోమవారం మధ్యాహ్నం నుంచి మూతపడ్డాయి. సోమవారం నుంచి మంగళవారం రెండు రోజులపాటు మద్యం దుకాణాలను మూసివేయాలని ఎక్సైజ్‌శాఖకు కేంద్ర ఎన్నికల కమిషన్ ఆదేశాలు ఇవ్వడంతో షాపులను మూయించివేశారు. సమాచారం తెలిసిన మందు బాబులు ముందుగానే మద్యం దుకాణాల వద్ద బారులు తీరారు. తిరిగి బుధవారం 11 గంటల తర్వాత తెరుచుకోనున్నాయి.

● హోటళ్లు మూసివేత

చింతలపూడి: శాంతిభద్రతల పరిరక్షణకు ముందస్తు చర్యల్లో భాగంగా చింతలపూడిలో భోజన హోటల్స్, కాఫీ హోటల్స్, మొబైల్ టిఫిన్ సెంటర్లు, చిరుతిండి దుకాణాలు సోమవారం మూతపడ్డాయి. సోమ, మంగళ, బుధవారం మూడు రోజులు దుకాణాలు మూసివేయాలని పోలీసులు విజ్ఞప్తి చేశారు. ఎవరూ గుంపులుగా ఉండరాదని, పోలీసులకు సహకరించాలని మైక్ ప్రచారం చేసినట్లు ఎస్సై కుటుంబరావు తెలిపారు.

సంయమనం పాటించండి

ప్రత్యర్థి పక్షాలు రెచ్చగొట్టినా వివాదానికి వెళ్లొద్దు : కూటమి శ్రేణులకు నేతల సూచనలు



కౌంటింగ్ ఏజెంట్లకు సూచనలు చేస్తున్న చింతమనేని ప్రభాకర్

పెదవేగి, జూన్ 3: ఓట్ల లెక్కింపు సమయంలో గందరగోళం సృష్టించడానికి ప్రత్యర్థులు కవ్వింపు చర్యలకు దిగుతారని, రెచ్చగొడతారని, సంయమనంతో ఓపిగ్గా ఉండాలని టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి చింతమనేని ప్రభాకర్ అన్నారు. ఓట్ల లెక్కింపును పురస్కరించుకుని సోమవారం ఏజంట్ల శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఓట్ల లెక్కింపు సమయంలో తీసుకోవాలని జాగ్రత్తలను పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. ప్రభాకర్ మాట్లాడుతూ ఓటమి భయం ప్రత్యర్థులను కుదురుగా ఉండనీయడంలేదని, ఈ నేపథ్యంలో లెక్కింపును సజావుగా జరగకుండా చేయడానికి కవ్వింపు చర్యలకు పాల్పడే అవకాశాలను కొట్టిపారేయలేమన్నారు. ఓట్ల లెక్కింపు సజావుగా సాగడమే లక్ష్యంగా అత్యంత జాగ్రత్తగా ఉండాలని, గొడవలు సృష్టించడానికి ప్రత్యర్థులు పన్నాగాలు పన్నుతారని, వాటిని సమర్థవంతంగా ఎదుర్కోవడానికి సిద్ధంగా ఉండాలని ఆయన చెప్పారు. కార్యక్రమంలో మాగంటి ప్రభాకర్, ఉప్పలపాటి శ్రీరామ్‌ప్రసాద్, బొప్పన సుధాకర్, మాగంటి నారాయణప్రసాద్, లావేటి శ్రీనివాసరావు, నంబూరి నాగరాజు, నేతల రవి, కౌంటింగ్ ఏజంట్లు పాల్గొన్నారు.

● లింగపాలెం: ఎన్నికల్లో టీడీపీ కూటమి విజయం సాధిస్తుందని, చంద్ర బాబునాయుడు ముఖ్యమంత్రిగా ప్రమాణస్వీకారం చేస్తారని టీడీపీ మండల అధ్యక్షుడు గరిమళ్ళ చలపతిరావు అన్నారు. లింగపాలెంలో సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్రానికి మంచి రోజులు రాబోతున్నాయన్నారు. సర్వేలు సంస్థలన్నీ తెలుగుదేశం పార్టీ కూటమి గెలుస్తుందని చెబుతుంటే జగన్ రెడ్డి ప్రభుత్వం భయపడుతుందన్నారు. తామే గెలుస్తామని గొప్పలు చెప్పుకుంటున్న వైసీపీకి పోస్టల్ బ్యాలెట్లపై భయమెందుకన్నారు. తెలుగుదేశం శ్రేణులు ఎటువంటి గొడవలకు వెళ్లకుండా పూర్తి సంయమనంతో ఉండాలని ఆయన సూచించారు.

● కామవరపుకోట: ఎన్నికల్లో కూటమి అభ్యర్థులకు సత్ఫలితాలు వస్తాయని నాయకులు ఘంటా సుధీర్‌బాబు, మద్దిపోటి నాగేశ్వర రాంబాబు, కోనేరు వెంకట్రామయ్య, కోనేరు వెంకట సుబ్బారావు ఆశాభావం వ్యక్తం చేశారు. స్థానిక టీడీపీ కార్యాలయం వద్ద కూటమి నాయకులు, కార్యకర్తలు, లెక్కింపు ఏజెంట్లతో సమావేశం నిర్వహించారు. నాయకులు, కార్యకర్తలు, ఏజెంట్లు అప్రమత్తంగా ఉండాలన్నారు. ఎవరైనా దాడులు, కవ్వింపు చర్యలకు దిగితే సంయమనంతో వ్యవహరించాలన్నారు. ఒంటెద్దు ఏసువరప్రసాద్, షేక్ వలీ, కోటగిరి వేణుబాబు, నెక్కలపు సూర్యనారాయణ, గంగాధరరావు పాల్గొన్నారు.

కూటమి కార్యకర్తలు శాంతంగా ఉండాలి : పత్సమట్ల

ఉంగుటూరు: ఎవరు రెచ్చగొట్టినా కూటమి కార్యకర్తలు ఆవేశపడవద్దని ఉంగుటూరు అభ్యర్థి పత్సమట్ల ధర్మరాజు సూచించారు. జనసేన కార్యాలయంలో సోమవారం జరిగిన కూటమి కార్యకర్తల ఆత్మీయ సమావేశంలో జనసేన, తెలుగుదేశం, బీజేపీ కార్యకర్తలు పాల్గొన్నారు. కొందరు సోషల్ మీడియా వేదికను చేసుకుని రెచ్చగొట్టవచ్చని, సంయమనం పాటించాలన్నారు. తాను పవన్ కల్యాణ్ ఆదేశాల మేరకు పనిచేసి అన్ని వర్గాల మన్ననలు పొందుతానన్నారు. ఈ సందర్భంగా నియోజకవర్గంలోని వివిధ వర్గాల ప్రజలు వచ్చి ఆశీసనకు శుభాకాంక్షలు తెలిపారు.

● ఏలూరు కార్పొరేషన్: ఎన్నికల్లో జనసేన, బీజేపీ టీడీపీ కూటమి విజయం సాధిస్తుందని జనసేన జిల్లా అధికార ప్రతినిధి రెడ్డి అప్పలనాయుడు అన్నారు. జనసేన కార్యాలయంలో నాయకులు, కార్యకర్తలు, కౌంటింగ్ ఏజెంట్లతో ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించారు. అందరూ సమన్వయంతో ఉండాలని, 144 సెక్షన్ అమలులో ఉన్న నేపథ్యంలో పోలీసు వారికి సహకరిస్తూ న్యాయబద్ధంగా వ్యవహరించాలన్నారు. రౌండ్ల వారీగా కూటమికే విజయావకాశాలువస్తాయని, ప్రత్యర్థులు ఘర్షణలకు, కవ్వింపు చర్యలకు పాల్పడతారని, అనవసర వ్యాఖ్యలు చేస్తారని, రెచ్చగొట్టే విధంగా వ్యవహరిస్తారని, వాటన్నింటినీ సంయమనంతో వ్యవహరించాలన్నారు. ఏ ఒక్కరూ కూడా తగువులకు వెళ్ళవద్దని చెప్పారు. నగిరెడ్డి కాశీ నరేష్, సరిది రాజేష్, ఈశ్వరరావు, నిమ్మల శ్రీను, తదితరులు ఉన్నారు.



పొగాకు రైతు సంఘం నాయకుడికి వినతిపత్రం ఇస్తున్న రైతులు

లోగ్రేడ్, గ్రీన్ పొగాకును కొనుగోలు చేయాలి

బుట్టాయగూడెం, జూన్ 3: పొగాకు వేలం కేంద్రాల ద్వారా లోగ్రేడ్, గ్రీన్ పొగాకును కూడా కంపెనీలు కొనుగోలు చేసేలా బోర్డు ద్వారా చర్యలు తీసుకోవాలని వర్జీనియా పొగాకు రైతులు కోరారు. జంగారెడ్డిగూడెం రైతు సంఘం కార్యాలయం వద్ద పరిమి రాంబాబు అధ్యక్షతన సోమవారం జరిగిన సమావేశంలో పొగాకు మార్కెట్ ధరలపై చర్చించారు. మే 31న జీలుగుమిల్లి మండలం ములగలంపల్లిలో దొంగతనంగా తోటల్లోని పచ్చాకు కొట్టించి అమ్మకాలు చేస్తున్నవారిపై చర్యలు తీసుకోవాలని సమావేశం తీర్మానించింది. ఈ మేరకు రైతు సంఘం నాయకుడు కరాటం వెంకటరెడ్డి నాయుడికి వినతిపత్రాన్ని అందజేశారు. పచ్చాకును కొనుగోలు చేయడం వంటి చర్యలకు పాల్పడుతున్న రైతుకు రైతు సంఘం సభ్యత్వాన్ని రద్దు చేయాలని తీర్మానించారు. పచ్చాకును పోగొట్టుకున్న రైతులకు నష్టపరిహారం ఇప్పించాలని కోరారు. భవిష్యత్‌లో ఇటువంటి ఘటనలు జరగకుండా బోర్డు అధికారులు చర్యలు తీసుకోవాలని, చోరీలకు పాల్పడినవారిపైన ప్రోత్సహిస్తున్న వారిపైన చట్టపరమైన చర్యలు తీసుకోవాలని రైతులు కోరారు.

యోగావల్ల ఎన్నో ఉపయోగాలు



యోగా నేర్చుకుంటున్న విద్యార్థులు

లింగపాలెం, జూన్ 3: యోగావల్ల అనేక ఉపయోగాలు ఉన్నాయని గ్రంథాలయాధికారి సీహెచ్.వెంకటరమణ అన్నారు. ధర్మాజీగూడెం వేసవి శిక్షణలో భాగంగా సోమవారం యోగా తరగతులు నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ విద్యార్థులు యోగాసనాలు సాధన చేయాలని, యోగావల్ల అనేక ఉపయోగాలు ఉన్నాయన్నారు. విద్యార్థులతో కథలు చదివించి, వాటిలోని నీతిని వారికి వివరించారు. రిసోర్స్‌పర్సన్ ఏవీ.నారాయణ విద్యార్థులకు గణితశాస్త్రంపై అవగాహన కల్పించారు. విద్యార్థులకు తెలుగు గ్రామర్ క్లాసులు, డిక్టేషన్, జనరల్ నాలెడ్జ్ క్లాసులు నిర్వహించారు. కార్యక్రమంలో గ్రంథాలయాధికారి సీహెచ్.వెంకటరమణ, రీసోర్స్ పర్సన్స్ కె.ప్రభావతి, ఎం.జ్యోతిప్రియాంక, ఏవీ.నారాయణ, పలువురు విద్యార్థులు పాల్గొన్నారు.

సీపీఐ నేత చవ్వా నాగేశ్వరరావుకు నివాళి

చింతలపూడి, జూన్ 3: స్థానిక సీపీఐ సీనియర్ నాయకుడు చవ్వా నాగేశ్వరరావు మృతికి సీపీఐ కార్యాలయంలో సంతాప సభ నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. సీపీఐ, సీపీఎం, సీపీఐ (ఎంఎల్) వామపక్ష నాయకులు వసంతరావు, ఆది సత్యనారాయణ, సోమశేఖర్, రామచంద్రారెడ్డి, డి.కృష్ణ, రంగనాథ్, గురవయ్య, సూర్యకుమార్, పలువురు మాట్లాడుతూ నాగేశ్వరరావు పార్టీకి అందించిన సేవలను కొనియాడారు. కుటుంబసభ్యులకు సంతాపం తెలిపారు.

వైద్య సిబ్బందికి వసతి లేదు

శిథిలావస్థకు చేరిన క్వార్టర్స్

24 గంటల వైద్య సేవలు ఎలా..?



శిథిలావస్థకు చేరిన వైద్య సిబ్బంది క్వార్టర్స్

పెదపాడు, జూన్ 3 : స్థానికంగా నివాసముంటూ 24 గంటలు వైద్య సేవలందించేందుకు అందుబాటులో ఉండాల్సిన వైద్య సిబ్బందికి వసతి లేదు. శిథిలావస్థకు చేరుకున్న క్వార్టర్స్ వారిని భయపెడుతున్నాయి. పెదపాడు ప్రాథమిక ఆరోగ్యకేంద్రం పరిధిలో 11 సబ్ సెంటర్లు ఉన్నాయి. పీహెచ్‌సీ పరిధిలోని గ్రామాలకు చెందిన అవుట్ పెషేంట్లు 100 నుండి 120 మందికి వైద్యసేవలు పొందుతుంటారు. పరిసరప్రాంతాల్లో ఎక్కడైనా రోడ్డు ప్రమాదాలు, పాముకాటు, ఇతర అత్యవసర వైద్యసేవల కోసం పెదపాడు పీహెచ్‌సీకి పరుగులు పెడతారు. సిబ్బంది నివాసముండాల్సిన క్వార్టర్లు శిథిలమై నిరుపయోగం కావడంతో రాత్రి విధులు నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది ఆసుపత్రి కార్యాలయ గదుల్లో గడపాల్సిందే. లేకుంటే అత్యవసర సేవలందించే వారు ఉండరు. పీహెచ్‌సీలో 24 గంటలూ పూర్తిస్థాయిలో వైద్య సేవలందించాలంటే వైద్యులు, సిబ్బందికి మౌలిక వసతులతో కూడిన క్వార్టర్స్ అందుబాటులోకి తీసుకురావాలని ఎంతో కాలంగా సిబ్బంది మొరపెట్టుకుంటున్నారు. క్వార్టర్స్‌తో పాటు పక్కనే పాడుబడిన సిబ్బంది శిక్షణా కేంద్రంలో పాములు, విషపురుగులు సంచారంతో భయపడుతున్నారు. ఆసుపత్రిలోకి కూడా పాములు రావడంతో సిబ్బంది హడలిపోతున్నారు. క్వార్టర్స్ శిథిలావస్థకు చేరుకోవడంతో పూర్తిస్థాయిలో వైద్యసిబ్బంది స్థానికంగా నివాసం ఉండలేకపోతున్నారు, ఇతర ప్రాంత్రాల్లో అద్దెకు ఉండడంతో 24 గంటల వైద్య సేవలందించాలనే లక్ష్యం నీరుగారిపోతోందని, ఇకనైనా సంబంధిత అధికారులు శిథిలావస్థకు చేరిన క్వార్టర్స్‌ను పూర్తిస్థాయిలో తొలగించి తిరిగి నివాసయోగ్యమైన భవనాలను నిర్మించాలని కోరుతున్నారు.



మలేరియాపై అవగాహన ర్యాలీలో జిల్లా వైద్యాధికారి శర్మిష్ట

మలేరియా నిర్మూలనకు కృషి : జిల్లా వైద్యాధికారి

ఏలూరు ఎడ్యుకేషన్, జూన్ 3: మలేరియా నిర్మూలనకు ప్రతీ ఉద్యోగి చిత్తశుద్ధితో కృషిచేయాలని జిల్లా వైద్యాధికారి శర్మిష్ట సూచించారు. డీఎంహెచ్‌వో కార్యాలయంలో పీహెచ్‌సీ ల్యాబ్ టెక్నీషియన్లతో సోమవారం సమావేశం నిర్వహించారు. మలేరియా రోగనిర్ధారణకు జరుగుతున్న పరీక్షలపై సమీక్షించారు. వర్షాకాలంలో జ్వరాల తీవ్రత పెరిగే అవకాశం ఉందని, ప్రతీ జ్వర బాధితుడికి రక్తపరీక్షలు చేయాలని, డెంగీ, మలేరియా కిట్ల నిల్వలు పూర్తిస్థాయిలో అందుబాటులో ఉంచుకోవాలన్నారు. జూన్ మొత్తం మలేరియా వ్యతిరేక మాసోత్సవ కార్యక్రమాలు నిర్వహించాలని కోరారు. 2027నాటికి జిల్లాను మలేరియా రహిత జిల్లాగా ప్రకటించాలన్న లక్ష్యానికి అనుగుణంగా ఉద్యోగులు క్షేత్రస్థాయిలో సమన్వయంతో పనిచేయాలన్నారు. జిల్లా మలేరియా ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ విజయలక్ష్మి, అసిస్టెంట్ మలేరియా అధికారి గోవిందరావు, తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యార్థులకు పర్యావరణ దినోత్సవ పోటీలు

ఏలూరు ఎడ్యుకేషన్, జూన్ 3: ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని (జూన్ 5) పురస్కరించుకుని ప్రభుత్వ పాఠశాలల్లో 6 నుంచి 12వ తరగతి వరకు చదువుతున్న విద్యార్థులకు ఈ నెల 4లోపు మండలస్థాయిలో వ్యాసరచన, పోస్టర్ ప్రజంటేషన్, వక్తృత్వ పోటీలను నిర్వహించాలని డీఈవో అబ్రహం స్కూల్ హెచ్‌ఎంలను, ఎంఈవోలను సోమవారం ఆదేశించారు. మండల స్థాయి పోటీల్లో ప్రథమస్థానంలో నిలిచిన విజేతల వివరాలను మంగళవారం సాయంత్రంలోపు సంబంధిత డీవైఈవోలకు పంపించాలని ఎంఈవోలను కోరారు. మండలస్థాయి విజేతలకు ఈ నెల 5న జిల్లాస్థాయి పోటీలను నిర్వహిస్తామని, వివరాలకు సమగ్రశిక్ష జిల్లా ఏఎంవో రామారావును 92486 69171, జిల్లా అకడమిక్ కో-ఆర్డినేటర్ బాస్కరరావును 99899 21797లలో సంప్రదించాలని సూచించారు.

ఘనంగా వెంకటేశ్వరస్వామి వార్షిక కల్యాణం



కల్యాణమూర్తులుగా స్వామి, అమ్మవార్లు

బుట్టాయగూడెం, జూన్ 3: జంగారెడ్డిగూడెం మండలం గుర్వాయిగూడెం మద్ది క్షేత్రంలో హనుమజ్జయంతి సహిత కల్యాణ మహోత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. క్షేత్రలో ఉపాలయమైన వేంకటేశ్వర స్వామికి సోమవారం వార్షిక కళ్యాణ మహోత్సవాన్ని అర్చక స్వాములు ఘనంగా జరిపించారు. కల్యాణానికి ముందు స్వామివారికి ప్రభాతసేవ, నిత్యార్చన, నిత్య హోమం, బలిహరణ తదితర పూజాది కార్యక్రమాలను జరిపించినట్లు ఆలయ ఈవో ఆకుల కొండలరావు తెలిపారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని స్వామివారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. భక్తులకు అన్ని సౌకర్యాలు కల్పించినట్లు ఈవో తెలిపారు.

శివాలయాల్లో బిల్వార్చనలు

ఏలూరు కార్పొరేషన్, జూన్ 3: నగరంలోని శివాలయాల వద్ద భక్తులు సోమవారం ప్రత్యేక పూజలు చేశారు. స్వామివారికి అభిషేకాలు, బిల్వార్చన నిర్వహించారు. ప్రమిదలలో దీపాలు వెలిగించి హారతులు ఇచ్చారు. శివ పురాణాలను పఠించారు. శివనామస్తోత్రాలను ఆలపించారు. ఈ మేరకు శివనగర్ మల్లికార్జునస్వామి, దక్షిణపువీధి మార్కండేయస్వామి, జరాపహరేశ్వరస్వామి, అగ్రహారం నగరేశ్వరస్వామి, ప్రతాప కాశీ విశ్వేశ్వరస్వామి, పవరుపేట కాశీ విశ్వేశ్వరాలయం, ఆదివారపుపేట, పత్తేబాద రామలింగేశ్వర స్వామి ఆలయాల వద్ద భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. శివాలయాల వద్ద భక్తుల సందడి వేకువజాము నుంచే నెలకొంది. విజయం చేకూర్చాలంటూ టీడీపీ, జనసేన, బీజేపీ, వైసీపీ నాయకులు ప్రత్యేక పూజలు చేశారు.

ఆంజనేయుని సన్నిధిలో అన్న సమారాధన

హనుమజ్జయంతి ఉత్సవాలు ముగింపు సందర్భంగా గజవల్లివారిచెరువు సమీపంలో పంచముఖ ఆంజనేయస్వామి ఆలయ ప్రాంగణంలో సోమవారం అన్న సమారాధన నిర్వహించారు. తొలుత స్వామివారికి తమలపాకులు, సింధూరంతో పూజలు చేశారు. హనుమాన్‌చాలీసా పారాయణ నిర్వహించి అనంతరం అన్న సమారాధన ప్రారంభించారు. పెద్ద సంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించుకుని మొక్కుబడులు చెల్లించుకున్నారు.

శనీశ్వరస్వామికి అభిషేకాలు

కామవరపుకోట, జూన్ 3: ఆడమిల్లి మందా సమేత శనీశ్వరస్వామి ఆలయంలో సోమవారం అభిషేకాలు, అమ్మవారికి కుంకుమార్చన చేశారు. స్వామివారిని టీడీపీ నాయకులు జిజ్జూరి బాబీ, సర్పంచ్ గూడపాటి కేశవరావులు ప్రత్యేక పూజలు చేశారు. స్థానిక వీరభద్రస్వామి ఆలయం వద్ద మేడూరి రంగబాబు, తదితరులు అభిషేకాలు, అర్చనలు నిర్వహించారు.

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

రైతులకు రూ.6.86 లక్షల సున్నా వడ్డీ

ఏలూరు రూరల్, జూన్ 3: ఏలూరు రూరల్ మండలంలో 2021-22 రబీ సీజన్‌కు సంబంధించి 242 మంది రైతులకు రూ.4.16 లక్షలు ఖరీఫ్ సీజన్‌కు 132 మందికి రూ.2.70 లక్షలు సున్నా వడ్డీ పంట రుణాలపై రాయితీగా ఇచ్చామని, ఎన్నికల కారణంగా ఇంకా చెల్లించాల్సిన వారికి త్వరలో చెల్లిస్తామని, వ్యవసాయశాఖ జేడీ ఎస్.కె హబీబ్‌భాష తెలిపారు. 'రైతులకు గుండుసున్నా' శీర్షికన సోమవారం ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన కథనంపై జేడి స్పందించారు. సున్నా వడ్డీ పంట రుణాలు రాయితీ రైతుల ఖాతాలో నేరుగా జమ చేసినట్లు తెలిపారు. ప్రస్తుతం ఎన్నికల నియమావళి అమల్లో ఉన్నందున ఇంకా చెల్లించాల్సిన సున్నావడ్డీ, పంట రాయితీలను రాబోయే రోజుల్లో నేరుగా రైతుల ఖాతాలో జమ చేస్తామన్నారు.

ఎన్నాళ్లీ పాట్లు

- డ్రైనేజీపై స్లాబ్ లేక దిగబడుతున్న వాహనాలు
- ఫిర్యాదు చేసినా పట్టించుకోని అధికారులు



ఆగిరిపల్లి, జూన్ 3: స్థానిక దమ్మన్న మండపం వద్ద ఉన్న డ్రైనేజీపై స్లాబు లేని కారణంగా అనేక సార్లు వాహనాలు పడిపోయినా అధికారులు పట్టించుకోవడం లేదు. పంచాయతీకి ఎన్నిసార్లు మొరపెట్టుకున్నా తమ గోడు అరణ్యరోదనగానే మిగిలిందని స్థానికులు, వాహనదారులు ఆరోపిస్తున్నారు. సోమవారం ఒక కారు ఆ డ్రైనేజీలోకి ఇరుక్కు పోయింది. ఇకనైనా పంచాయతీ వారు డ్రైనేజీపై స్లాబు ఏర్పాటు చేయాలని స్థానికులు కోరుతున్నారు.

గుంతల్ని మట్టితో పూడ్చారు మరి!


- సింహాద్రిపురం వద్ద కూరుకుపోయిన టిప్పర్



మునునూరు, జూన్ 3: నూజివీడు-ఏలూరు ప్రధాన రహదారి అధ్వానంగా ఉంది. వాహదారులు, పాదచారులు సైతం నరకం చూస్తున్నారు. సింహాద్రిపురం వద్ద ఈ రహదారిలో ఏర్పడిన పెద్ద పెద్ద గుంతలు చిన్నపాటి చెరువులను తలపించేలా నీరు ఉంది. ఆదివారం రాత్రి ఈ గుంతల్లో సర్పంచ్ నక్కనబోయిన సత్యనారాయణ, పీఏసీయస్ అధ్యక్షుడు మూల్పూరి నాగవల్లేశ్వరావు మట్టిని పోసి చదును చేశారు. అయితే అదే రోజు రాత్రి ఇబ్రహీంపట్నం నుంచి విజయరాయి వెళ్లేందుకు చిప్స్ లోడ్‌తో వస్తున్న టిప్పర్ వాహనం మట్టిలో కూరుకుపోయింది. ఆదివారం రాత్రి నుంచి ఈ వాహనం అక్కడే ఉండటంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ప్రధాన రహదారిలో ఉన్న గుంతల్లో కంకర లేదా చిప్స్ వేయాలేకాని, మట్టి పోయడం ఏమిటంటూ వాహనదారులు ప్రజాప్రతినిధుల తీరుపై మండిపడుతున్నారు. జిల్లా కేంద్రమైన ఏలూరుకు వెళ్లే ప్రధాన రహదారి ఇంత అధ్వానంగా మారినా, పూర్తిస్థాయి అభివృద్ధి దేవుడెరుగు, కనీసం ప్రమాదకరంగా ఉన్న గుంతలనైనా పూడ్చేందుకు సంబంధిత అధికారులు చర్యలు తీసుకోకపోవడం ఈ ప్రభుత్వ అసమర్థ పాలనకు నిదర్శనమని వాహనదారులు, స్థానికులు అసహనం వ్యక్తం చేస్తున్నారు.

విజయలక్ష్మి వరించేదెవరినో..?

- మరికొద్ది గంటల్లో వీడనున్న ఉత్కంఠ
- నేడు ఓట్ల లెక్కింపు



నేడు ఓటర్ల తీర్పు బహిర్గతం కానుంది. ఉత్కంఠకు తెర వీడనుంది. మంగళవారం ఏలూరులో ఓట్ల లెక్కింపు ప్రారంభం కానుంది. అభ్యర్థులతో పాటు ప్రజలు ఫలితాలపై తీవ్ర ఉత్కంఠతో ఎదురు చూస్తున్నారు. మరోవైపు అవాంఛనీయ ఘటనలు జరగకుండా పోలీసులు బందోబస్తు నిర్వహిస్తున్నారు. కొద్ది గంటల్లోనే ప్రజాతీర్పు వెలువడనుంది.

కైకలూరు, జూన్ 3: సార్వత్రిక ఎన్నికల్లో పోటీ చేసిన అభ్యర్థుల భవిష్యత్ నేడు తేలనుంది. ఓట్ల లెక్కింపు సమయం దగ్గరపడడంతో అభ్యర్థులు, ఓటర్లలో ఉత్కంఠ పెరిగింది. అభ్యర్థులు గెలుపుపై ఎవరికి వారు ధీమా వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే గ్రామాల్లో ఎగ్జిట్ పోల్స్‌పై ప్రజలు తీవ్రస్థాయిలో చర్చించుకుంటున్నారు. ప్రజలు, పందెంరాయుళ్ళు మాత్రం వారు అనుకున్న పార్టీ గెలుస్తుందని ధీమా వ్యక్తం చేస్తున్నారు. అలాగే గ్రామాల్లో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా పార్టీల కార్యాలయాల వద్ద, అభ్యర్థుల ఇళ్ళ వద్ద పోలీసులు బందోబస్తు నిర్వహిస్తున్నారు. జిల్లా సరిహద్దులో పోలీసులు విస్తృతంగా వాహనాలను తనిఖీ చేస్తున్నారు.

చాట్రాయి: ఎగ్జిట్ పోల్స్ కూటమి అధికారంలోకి వస్తుందని, మరికొన్ని వైసీపీ అధికారంలోకి వస్తుందని చెప్పటంతో ప్రజలతో పాటు రాజకీయ పార్టీలు అయోమయానికి గురవుతున్నాయి. ఈసారి ఓటర్లు తాము ఎవరికి ఓట్లు వేశామో చెప్పకుండా గుంభనంగా ఉండటం గమనార్హం. ఓట్లు వేసి పోలింగ్ బూత్ నుంచి బయటకు వచ్చే ఓటర్ల ముఖంలో హావభావాలను బట్టి, గ్రామలలో సీనియర్ రాజకీయ నాయకులు కొద్దిగా అటు ఇటుగా ఫలితాన్ని అంచనా వేసేవారు. కానీ ఇప్పుడు మారిన పరిస్థితుల్లో అంచనాలకు అందటం లేదని నాయకులు వాపోతున్నారు. కౌంటింగ్ పూర్తయి ఫలితాలు వచ్చే వరకు ఇటు రాజకీయ నాయకుల్లో, అటు జనంలో టెన్షన్ వీడదు. ఈసారి ఎన్నికల ఫలితాలపై పందెంరాయుళ్ళ హడావుడి ఎక్కువగా ఉంది. నూజివీడు కూటమి అభ్యర్థి కొలుసు పార్థసారథి, వైసీపీ అభ్యర్థి మేకా ప్రతాప్‌ల గెలుపు ఓటముల పైనా, రాష్ట్రంలో ప్రముఖులు పోటీ చేస్తున్న నియోజకవర్గాలపైనా చంద్రబాబు, పవన్‌కల్యాణ్, నారా లోకేష్‌ల మెజారిటీలపైనా పందేలు జరుగుతున్నాయి.

ముదినేపల్లి: కైకలూరు అసెంబ్లీ నియోజకవర్గ ఫలితంపై ముదినేపల్లి మండలంలో ఎడతెగని చర్చలు జరుగుతున్నాయి. ఇప్పటికే ఈ నియోజకవర్గ ఫలితంపై మండలంలో పెద్ద ఎత్తున పందేలు జరగగా, బెట్టింగ్ రాయుళ్ల ఫలితంపై ఉత్కంఠతో ఎదురుచూస్తున్నారు. ఈ నియోజకవర్గం నుంచి కూటమి అభ్యర్థిగా మాజీ మంత్రి కామినేని శ్రీనివాస్, వైసీపీ అభ్యర్థిగా ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు పోటీ చేస్తున్న విషయం తెలిసిందే. ఎన్‌డీఏ కూటమి స్వీప్ నియోజకవర్గంలో బలంగానే కనిపించిందన్నది రాజకీయ వర్గాల అంచనా.

శాంతి భద్రతలకు భంగం కలిగిస్తే చర్యలు



కైకలూరు టౌన్ సీఐ రఘు

కైకలూరు, జూన్ 3: ప్రజాస్వామ్య వ్యవస్థలో గెలుపోటములు సహజమని ఇతర పార్టీల వారితో కవ్వింపులకు దిగినా, దుష్ప్రచారాలు చేసినా నేరమని కైకలూరు టౌన్ సీఐ ఆకుల రఘు అన్నారు. సోమవారం ఆయన విలేకర్లతో మాట్లాడు తూ ఓట్ల లెక్కింపు సందర్భంగా మంగళవారం గ్రామాల్లో ప్రజలంతా పోలీసులకు సహకరించాలన్నారు. ఒకరిపై ఒకరు దూషణలకు దిగడం కానీ, సోషల్ మీడియాలో పోస్టులు పెట్టడం గానీ చేయవద్దని హెచ్చరించారు. ప్రతి ఒక్కరు సమన్వయంతో ఉండాలని, నియోజకవర్గానికి మంచి పేరు తేవాలన్నారు. ఎక్కడైనా సమస్య ఉంటే వెంటనే పోలీసులు దృష్టికి తెస్తే తామే స్వయంగా పరిష్కరి స్తామన్నారు. బాణాసంచాను కాల్చవద్దని, ఎన్నికల నిబం ధనలను ఉల్లంఘిం చిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

చాట్రాయి: సార్వత్రిక ఎన్నికల ఓట్ల లెక్కింపు సందర్భంగా మండలంలో అన్ని గ్రామాల్లో 144 సెక్షన్, పోలీస్ యాక్ట్ అమలులో ఉంటుందని, ఎవరైనా అవాంఛనీయ ఘటనలకు పాల్పడితే చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్ఐ కేసీహెచ్ స్వామి హెచ్చరించారు. సోమవారం ఆయన మాట్లాడుతూ మండలంలో సమస్యాత్మక గ్రామాలుగా గుర్తించిన కోటపాడు, పోలవరంలలో పోలీస్ పికెట్లు ఏర్పాటు చేశామని, సోమవరం, కొత్తగూడెం గ్రామాల్లోను గస్తీ నిర్వహిస్తున్నామన్నారు. కౌంటింగ్ సందర్భంగా ఎవరు ఆవేశాలకు లోనై అవాంఛనీయ సంఘటలకు పాల్పడవద్దని, కేసుల్లో ఇరుక్కొని ఇబ్బందులు పడవద్దని, 144 సెక్షన్ అమలులో ఉన్నందున జనం గుమిగూడవద్దని అన్ని గ్రామాల్లో మైక్ ప్రచారం నిర్వహిస్తున్నట్లు ఎస్సై చెప్పారు.

ముదినేపల్లి: సార్వత్రిక ఎన్నికల ఓట్ల లెక్కింపు సందర్భంగా మంగళవారం వివిధ రాజకీయ పార్టీల నాయకులు, కార్యకర్తలు, ప్రజలు సంయమనంతో వ్యవహరించాలని ముదినేపల్లి ఎస్ఐ దేశింశెట్టి వెంకట్ కుమార్ కోరారు. మండలంలో 144 సెక్షన్‌తోపాటు పోలీసు యాక్ట్ 30 అమలులో ఉందని, గ్రామాల్లో సైతం పై రెండు సెక్షన్లు అమలులో ఉంటాయని తెలిపారు. ఎన్నికల ఫలితాల ప్రకటన సందర్భంగా అలజడులు సృష్టించేందుకు ప్రయత్నించినా, రెచ్చగొట్టేలా వ్యవహరించినా ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. సెల్ ఫోన్లలో ఉద్రేక పూరిత మెసేజ్‌లు పెట్టినా ఉపేక్షించేది లేదన్నారు. బైండోవర్ కేసులు నమోదైన వారు, రౌడీ షీట్లు ఉన్న వారు మరింత జాగ్రత్తగా ఉండాలన్నారు. ర్యాలీలు, విజయోత్సవాలు నిషిద్ధమని, ప్రతి గ్రామంలోనూ పోలీసు ఫోర్స్ ఉందని తెలిపారు.

పందెంరాయుళ్లతో కిటకిటలాడిన ఆగిరిపల్లి

ఆగిరిపల్లి: 144 సెక్షన్ అమల్లో ఉన్నప్పటికీ విపరీతమైన రద్దీతో పందెం రాయుళ్ళతో ఆగిరిపల్లి మెయిన్‌రోడ్డు కిటకిటలాడిపోతోంది. స్థానిక యూనియన్ బ్యాంకు సమీపంలో పందెం రాయుళ్ళు రోడ్డుమీద భారీగా వాహనాలు పార్కు చేయటం వల్ల పోలీస్‌లకు తలనొప్పిగా మారింది. సోమవారం సాయంత్రం ఆగిరిపల్లి ఎస్సై సురేంద్రకుమార్ ఎన్నిసార్లు వచ్చి హెచ్చరించినా వాళ్ళ పద్ధతి మార్చుకోకపోవడంతో ఎస్సై లాఠీ ఝుళిపించగా పందెం రాయుళ్ళు పలాయనం చిత్తగించారు. కాగా ఆగిరిపల్లి మండలంలో 144, 30 సెక్షన్లు అమల్లో ఉన్నాయని గుంపులు గుంపులుగా సంచరించినా, అవాంఛనీయ ఘటనలకు పాల్పడినా చట్టప్రకారం శిక్షిస్తామని, ఏ పార్టీ వారనేది కూడా చూడనని ఎస్సై సురేంద్రబాబు హెచ్చరించారు.

పోలీస్ పికెట్ ఏర్పాటు

ముదినేపల్లి రూరల్: మంగళవారం ఓట్ల లెక్కింపు జరగనుండటంతో గ్రామాల్లో ఎటువంటి అల్లర్లు జరగకుండా ముందస్తుగా ముఖ్య కూడళ్లల్లో పోలీస్ పికెట్ ఏర్పాటు చేశారు. ఎస్సై వెంకట్ కుమార్ ఆధ్వర్యంలో విస్తృత పోలీస్ బందోబస్తుతో పాటు వాహన తనిఖీలు నిర్వహిస్తున్నారు. గ్రామాల్లో కొత్త వ్యక్తులు సంచరిస్తే తక్షణం పోలీసులకు తెలియచేయాలని గ్రామస్థులకు సూచించారు. ఘర్షణకు దిగవద్దని పార్టీల నాయకులు, కార్యకర్తలకు కౌన్సిలింగ్ ఇచ్చారు. రౌడీషీటర్లను బైండోవర్ చేశారు. సింగరాయపాలెం, గురజ, పెదపాలెప్రు, వైవాక, వడాలి, చిగురుకోట గ్రామాల్లో పోలీస్ పికెటింగ్ ఏర్పాటు చేశారు.

కలిదిండి: ఓట్ల లెక్కింపును పురస్కరించుకుని అల్లర్లు సృష్టించి శాంతి భద్రతలకు ఆటంకం కలిగిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్ఐ ప్రియకుమార్ హెచ్చరించారు. సోమవారం కలిదిండిలో పోలీసు సిబ్బందితో మైకుతో ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మారణాయుధాలతో హింసకు పాల్పడితే రౌడీషీట్ ఓపెన్ చేస్తామన్నారు. ఎన్నికల ఫలితాల అనంతరం విజయోత్సవాలు, ర్యాలీలు, బాణాసంచా కాల్చితే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. కోరుకొల్లు, వెంకటాపురం, మట్టగుంట సమస్యాత్మక గ్రామాలుగా గుర్తించి పటిష్ట భద్రత ఏర్పాటు చేశామన్నారు.



అకడమిక్ భవనాన్ని పరిశీలిస్తున్న అధికారుల బృందం

అకడమిక్ భవనం పరిశీలన

నూజివీడు, జూన్ 3: నూజివీడు ఎమ్మార్ అప్పారావు కాలేజ్ ఆఫ్ పీజీ స్టడీస్‌లో నూతనంగా నిర్మాణంలో ఉన్న అకడమిక్ భవనాన్ని కృష్ణా వర్సిటీ వీసీ ప్రొఫెసర్ జ్ఞానమణి, ఎడ్యుకేషన్, వెల్ఫేర్, ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఎండీ దివాన్‌రెడ్డి సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా వీసీ ప్రొఫెసర్ జి.జ్ఞానమణి అకడమిక్ భవనాన్ని త్వరితగతిన పూర్తిచేయాలని అధికారులను ఆదేశించారు. మౌలిక సదుపాయాలు కల్పనకు కావాల్సిన అన్ని రకాల సహాయ సహకారాలను అందిస్తున్నామని, కాంట్రాక్టర్లు త్వరితగతిన నిర్మాణ పనులను పూర్తిచేసి విద్యాసంవత్సరం ఆరంభం నాటికి భవనాన్ని అందుబాటులోకి తీసుకురావాలని సూచించారు. కృష్ణా యూనివర్శిటీ ఎమ్మార్ అప్పారావు కాలేజ్ ఫర్ పీజీ స్టడీస్ ప్రిన్సిపాల్ జె.నవీన, చీఫ్ ఇంజినీర్ నరసింహమూర్తి, ఈఈ రాయన్న తదితరులు పాల్గొన్నారు.



ముగింపు కార్యక్రమంలో విద్యార్థులు

ముగిసిన క్రీడాశిక్షణ

నూజివీడు టౌన్, జూన్ 3: పుస్తకాల పురుగులుగా మారిన విద్యార్థులకు ఆట విడుపుతో పాటు దేహదారుఢ్యం, క్రీడలపై ఆసక్తిని పెంచే దిశగా నూజివీడులో దాదాపు నెల రోజులుగా నిర్వహించిన క్రీడా శిబిరం సోమవారంతో ముగిసింది. విద్యార్థులకు వేసవి సెలవుల సందర్భంగా వీటీహెచ్ గ్రౌండ్‌లో వ్యాయామ ఉపాధ్యాయుల ఆధ్వర్యంలో సమ్మర్ స్పోర్ట్స్ క్యాంప్‌ను నిర్వహించారు. ఈ సందర్భంగా బాస్కెట్ బాల్, వాలీబాల్‌తో పాటు వివిధ క్రీడల్లో శిక్షణ ఇవ్వగా, ఆదివారం రాత్రి పోటీలు నిర్వహించి విద్యార్థులకు సర్టిఫికెట్లను అందించారు. వీటీహెచ్ కోచ్ వాకా నాగరాజు, వ్యాయామోపాధ్యాయులు వనజ, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ఆస్పత్రి సుందరీకరణకు విరాళం



ఆగిరిపల్లి, జూన్ 3: ఆగిరిపల్లి హోమియో ఆస్పత్రి సుందరీకరణకు ఆగిరిపల్లి డాక్యుమెంట్ రైటర్ బల్లం రామ్మోహన్ రాజు తన తండ్రి రఘుపతి రాజు జ్ఞాపకార్థం రూ. 10 వేలు విరాళం అందజేశారు. దాతను హోమియో ఆస్పత్రి డాక్టర్ రజిత అభినందించారు.

పర్యావరణ పరిరక్షణపై పోటీలు



పోస్టర్ ప్రజంటేషన్ విజేతకు అభినందన

చాట్రాయి, జూన్ 3: జూన్ 5న ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా స్థానిక జడ్పీ హైస్కూల్‌లో సోమవారం మండలంలోని పలు పాఠశాలల విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వ, పోస్టర్ ప్రజంటేషన్ పోటీలు నిర్వహించారు. వ్యాసరచనలో ప్రథమస్థానం ఎం. రాకేష్, వక్తృత్వంలో ప్రథమం బి. కేదార్‌నాథ్, పోస్టర్ ప్రజంటేషన్‌లో సీహెచ్ సందీప్ ప్రథమ స్థానంలో నిలిచారని, వీరు 5న జరిగే జిల్లా స్థాయి పోటీలలో పాల్గొంటారని ఎంఈవో వీయస్వీ బ్రహ్మాచారి తెలిపారు.

రఘురామను కలసిన బీజేపీ కన్వీనర్



ఆగిరిపల్లి, జూన్ 3: బీజేపీ నూజివీడు నియోజకవర్గ కన్వీనర్ జీఆర్కే రంగారావు ఆదివారం టీడీపీ ఉండి అసెంబ్లీ అభ్యర్థి రఘురామ కృష్ణరాజును ఆయన స్వగ్రామం పెద అమిరంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఎన్నికల్లో భారీ మెజార్టీతో గెలవాలని ఆశిస్తున్నట్లు తెలిపారు.



టీడీపీ నేత పరసాను పరామర్శించిన సీఎల్

ముదినేపల్లి, జూన్ 3: ఇటీవల రోడ్డు ప్రమాదానికి గురై చికిత్స పొందుతున్న టీడీపీ బీసీ సెల్ జిల్లా కార్యదర్శి పరసా ఏడుకొండలును రాష్ట్ర స్వచ్ఛంద కార్పొరేషన్ మాజీ చైర్మన్ డాక్టర్ సి.ఎల్.వెంకట్రావు పరామర్శించారు. సోమవారం ముదినేపల్లి మండలం విశ్వనాద్రిపాలెంలో ఆయన స్వగృహంలో కలిశారు. పార్టీ నాయకులు సాగిరాజు సత్యనారాయణ రాజు, యార్లగడ్డ గంగయ్య, వీరంకి చక్రపాణి, మరిపి ఈశ్వరరావు, చిన్నం హరిబాబు, సాయిల వెంకటేశ్వరరావు, మండవల్లి టీడీపీ నాయకుడు పాపయ్య తదితరులు ఏడుకొండలును పరామర్శించారు.



తిరుపతయ్య చిత్రటానికి నివాళులర్పిస్తున్న నాయకులు

పేదల విద్యాభివృద్ధికి కృషిచేసిన ఆముదాల

మునునూరు, జూన్ 3: చదువు.. చదివించు నినాదంతో గ్రామీణ ప్రాంతపేద వర్గాల విద్యాభివృద్ధికి కామ్రేడ్ ఆముదాల తిరుపతయ్య కృషి అభినందనీయమని సీపీఐ (ఎంఎల్) లిబరేషన్ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు డి.హరినాథ్ అన్నారు. సోమవారం తిరుపతయ్య వర్ధంతి సభను ఆముదాల కాంతారావు అధ్యక్షతను రమణక్కపేటలో నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి రాయంకుల లక్ష్మణరావు, నియోజకవర్గ సీపీఐ కార్యదర్శి బత్తుల వెంకటేశ్వరరావు, ఏఐసీసీటీయూ జిల్లా కార్యదర్శి వేముల బక్కయ్య, హరినాథ్ తదితరులు తిరుపతయ్య చిత్రపటం వద్ద నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తిరుపతయ్య, మేరీ రత్నావళి ఎడ్యుకేషనల్ ట్రస్టును స్థాపించి, మూడేళ్లుగా తల్లిదండ్రుల ఆశయాలను నేరవర్చేలా వారి తనయుడు కాంతారావు విద్యాభివృద్ధికి చేస్తున్న సేవ మరువలేనిదన్నారు. సీపీఐ నాయకులు, గ్రామ ప్రముఖులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

క్రీడలతో మానసికోల్లాసం



కలిదిండి, జూన్ 3 : క్రీడలతో మానసిక ఉల్లాసం కలుగుతుందని గ్రంథాలయాధికారి రాఘవులు అన్నారు. సోమవారం వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా కోరుకొల్లు గ్రంథాలయంలో విద్యార్థులకు ఆటల పోటీలు నిర్వహించారు. విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు.

భగవద్గీత పఠనం



ముదినేపల్లి, జూన్ 3 : వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా సోమ వారం ముదినేపల్లిలోని శాఖా గ్రంథాలయంలో భగవద్గీతలోని శ్లోకాల పఠనం నిర్వహించారు. గ్రంథాలయాధికారిణి ఎం.శ్రీదేవి విద్యార్థులకు భగవద్గీత సారాంశాన్ని వివరించారు. అనంతరం పలు ఆటల పోటీలు నిర్వహించారు.

సంయమనం పాటించాలి : కామినేని



కైకలూరు, జూన్ 3: ఓట్ల లెక్కింపు సందర్భంగా గ్రామాల్లో పార్టీ నాయకులు, కార్యకర్తలు తొందరపాటు చర్యలకు పాల్పడవద్దని కైకలూరు బీజేపీ అభ్యర్థి డాక్టర్ కామినేని శ్రీనివాస్ అన్నారు. సోమవారం కైకలూరు మండలం వరహాపట్నంలో ఆయన విలేకర్లతో మాట్లాడుతూ శాంతియుతమైన వాతావరణంలో ప్రజలంతా కోపతాపాలకు లోనుకాకుండా ఉండాలన్నారు. టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలు, సామాన్య ప్రజలు సైతం ఎన్నికల ఫలితాలపై ఎక్కడా వివాదాలకు వెళ్లకూవద్దని సూచించారు. ప్రజాతీర్పును ప్రజలంతా గౌరవించాలన్నారు.

350 క్వింటాళ్ల వరి విత్తనాలకు ఇండెంట్

ముదినేపల్లి, జూన్ 3 : ఖరీఫ్ సీజనుకు ముదినేపల్లి మండలంలోని రైతులకు సబ్సిడీపై వరి విత్తనాలను పంపిణీ చేసేందుకు 350 క్వింటాళ్ల మేరకు ఇండెంట్ పంపినట్లు మండల వ్యవసాయాధికారి వేణుమాధవ్ తెలిపారు. మండలంలో సుమారు 17 వేల ఎకరాల ఆయకట్టులో సార్వా వరి సాగు జరుగుతుందని తెలిపారు. స్వర్ణ రకం వరి విత్తనాలు 150 క్వింటాళ్లు, 1061 రకం వంద క్వింటాళ్లు, నూతన వరి వంగడం 1318 విత్తనాలకు వంద క్వింటాళ్లకు సీడ్ కార్పొరేషన్‌కు ఇండెంట్ పంపినట్లు తెలిపారు. వారం రోజుల్లో వరి విత్తనాలు రైతులకు అందుబాటులోకి వస్తాయని, ఆర్బీకేల నుంచే రైతులకు వాటిని పంపిణీ చేస్తామన్నారు. ఎరువులు, పురుగు మందులకు సంబంధించి కూడా ఇండెంట్లు రూపొందిస్తున్నట్లు ఏవో వేణుమాధవ్ తెలిపారు.

ఆంజనేయస్వామికి చక్రస్నానం

ముదినేపల్లి, జూన్ 3 : ముదినేపల్లిలోని శ్రీసువర్చలా సమేత శ్రీ భక్తాంజనేయ స్వామి ఆలయంలో హనుమజ్జయంతి ఉత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. సోమవారం స్వామివారికి చక్రస్నానం నిర్వహించారు. ధ్వజారోహణ, పుష్పోత్సవం కార్యక్రమాలను నిర్వహించారు. ఆర్యవైశ్య సంఘ నాయకుల ఆధ్వర్యంలో పెద్ద సంఖ్యలో భక్తులు స్వామివారికి పూజలు జరిపారు. అర్చకులు శ్రీనివాసులు, పణికుమార్, బృందావనం నరసింహం అభిషేకాలను నిర్వహించారు. ఈ నెల 5న దేవస్థానం వద్ద అన్నసమారాధన జరుగనుంది.

సహాయ మాత ఆలయ ఫాదర్‌గా మరియదాసు



ముదినేపల్లి, జూన్ 3 : ఆర్‌సీఎం సంస్థ ఆధ్వర్యం లో ముదినేపల్లి సహాయ మాత ఆలయానికి నూతన ఫాదర్‌గా కమతం మరియదాసు నియ మితులయ్యారు. ఆయన సోమ వారం బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా మరియ దాసుకు ఆర్‌సీఎం సంఘీయులు స్వాగతం పలికి సత్కరించారు. సహాయ మాత ఆలయ అభివృద్ధికి కృషి చేస్తానని ఆయన తెలిపారు.

15 మంది రౌడీషీటర్లు బైండోవర్

మునునూరు, జూన్ 3: ఓట్ల లెక్కింపు నేపథ్యంలో గ్రామాల్లో ఎటువంటి అల్లర్లు, ఘర్షణలు జరుగకుండా మండల వ్యాప్తంగా ఉన్న 24 మంది రౌడీషీటర్లలో 15 మంది ఏ కేటగిరి రౌడీషీటర్లను సోమవారం బైండోవర్ చేసినట్లు ఎస్ఐ పి.వాసు తెలిపారు. పోలీస్‌స్టేషన్‌లో రమణక్కపేట, అక్కిరెడ్డిగూడెం, కాట్రేనిపాడు తదితర గ్రామాలకు చెందిన రౌడీషీటర్లకు ఆయన కౌన్సిలింగ్ ఇచ్చారు. గ్రామాల్లో శాంతి భద్రతలకు విఘాతం కలిగించినా, నాయకుల గెలుపోటములపై ఘర్షణలకు దిగినా సహించేది లేదన్నారు. 10వ తేదీ వరకు మండల వ్యాప్తంగా 144 సెక్షన్ అమల్లో ఉంటుందని, ఎన్నికల సంఘం నిబంధనలకు విరుద్ధంగా ప్రవర్తిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

దాడిచేసిన వారిపై కేసు నమోదు

మునునూరు, జూన్ 3: దాడి ఘటనపై మునునూరు ఎస్ఐ పి.వాసు సోమవారం కేసు నమోదు చేశారు. రమణక్కపేట గ్రామానికి చెందిన రేమల్లి రాజు గ్రామంలోని శ్రీను దుకాణంలో ఈ నెల ఒకటిన వాటర్ గ్లాసులు, వాటర్ ప్యాకెట్లు కొనుగోలు చేసి యజమాని శ్రీనుకు రూ. 100 ఇవ్వబోగా చిల్లర లేదని శ్రీను చెబుతున్న క్రమంలో దుకాణంలోని మల్లయ్యబాబు అనే వ్యక్తి జోక్యం చేసు కోవడంతో వారి మధ్య ఘర్షణ జరిగింది. దీంతో రాజుపై మల్లయ్యబాబు, శ్రీను దాడికి పాల్పడ్డారు. నూజివీడు ఏరియా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న రాజు వాంగ్మూలం మేరకు నిందితులపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ పి. వాసు తెలిపారు.

క్రైం సమాచారం

లారీని ఢీకొన్న ట్రావెల్స్ బస్సు

- నల్లగొండ జిల్లా చిట్యాలలో ప్రమాదం
- ఒకరి మృతి, మరొకరికి గాయాలు
- మృతుడు భుజబలపట్నం వాసి



కుటుంబరావు మృతదేహం

చిట్యాల రూరల్, జూన్ 3 : జాతీయ రహదారిపై వెళుతున్న ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు లారీని ఢీకొన్న ఘటనలో ఒకరు మృతి చెందగా మరొకరికి గాయాలయ్యాయి. ఈ ప్రమాదం నల్లగొండ జిల్లా చిట్యాల మండలం గుండ్రాంపల్లి శివారులో ఆదివారం అర్ధరాత్రి జరిగింది. చిట్యాల ఎస్ఐ-2 లింగయ్య తెలిపిన వివరాల ప్రకారం.. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ఏలూరు జిల్లా కైకలూరు మండలం భుజబలపట్నం గ్రామానికి చెందిన ఆగు సోమల కుటుంబరావు (42) హైదరాబాద్‌లోని కోమలి ట్రావెల్స్‌లో బస్సు క్లీనర్‌గా పనిచేస్తున్నాడు. విధుల్లో భాగంగా ఈ నెల 2వ తేదీన రాత్రి హైదరాబాద్‌లోని బీహెచ్‌ఈఎల్ నుంచి విజయవాడకు ప్రయాణికులతో వెళ్తున్న కోమలి ట్రావెల్స్ బస్సులో డ్రైవర్ ఆరిగిల మణికంఠతో పాటుగా బయలుదేరాడు. మార్గమధ్యలో బస్సు అర్ధరాత్రి దాటాక చిట్యాల మండలంలోని గుండ్రాంపల్లి శివారులోకి చేరుకోగానే పెట్రోల్ బంకు నుంచి లారీ వేగంగా రోడ్డు మీదకు వచ్చింది. బస్సు అదుపుతప్పి లారీని వెనుక నుంచి ఢీకొట్టింది. దీంతో బస్సులో ఉన్న కుటుంబరావుతో పాటు డ్రైవర్ మణికంఠకు గాయాలయ్యాయి. బస్సులోనే ఉన్న మరో డ్రైవర్ నాగేంద్రవరప్రసాద్ ఇద్దరిని చికిత్స నిమిత్తం చౌటుప్పల్‌లోని ప్రభుత్వాసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో కుటుంబరావు మృతి చెందాడు. కుటుంబరావు భార్య సంధ్యారాణి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ లింగయ్య పేర్కొన్నారు.

చెరువులో మునిగి బాలుడి మృతి

తాడేపల్లిగూడెం రూరల్, జూన్ 3: చెరువులో పడి బాలు డు మృతి చెందిన ఘటన జగన్నాథపురంలో జరిగింది. స్థానికులు తెలిపిన వివరాలివి. గ్రామంలో పంచాయతీ చెరువు లో చేపలు పట్టేందుకు మెంట పాడుకు చెందిన వారికి కాంట్రా క్టుకు అప్పగించారు. సోమవారం చేపలు పట్టడం పూర్తయిన తరువాత వారిలో ముగ్గురు బాలురు చెరువులో సరదాగా ఆడేందుకు దిగారు. వారిలో రాకేశ్(15) ఊబిలో కూరుకుపోయి ఊపిరాడక కొట్టుకున్నాడు. ఇది చూసిన ఇద్దరు పిల్లలు భయపడి పారిపోయారు. సమాచారం అందించకపోవడంతో రాకేశ్ మృతి చెందాడు. దీంతో బాలుడి మృతదేహంతో బాలుడి తల్లిదండ్రులు ఆందోళనకు దిగారు. తమకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. పంచాయతీ చేపల చెరువు పట్టేందుకు బాలలను కూలికి తీసుకురావడమేంటని ఈ ఘటన తెలిసిన వారు నిలదీస్తున్నారు.

ఆక్వాకు విద్యుత్ షాక్

- ఏరియేటర్లు పని చేయక ఆక్సిజన్ లోపం
- మృత్యువాత పడుతున్న రొయ్యలు
- లక్షలాది రూపాయల నష్టం
- జనరేటర్ల ఏర్పాటుతో అదనపు భారం



చేపల చెరువులో తిప్పుతున్న బోటు

కలిదిండి, జూన్ 3 : ఆక్వా సాగు రైతులకు భారంగా మారుతోంది. ఒకవైపు వాతావరణం అనుకూలించకపోవడం, మరో వైపు అప్రకటిత విద్యుత్ కోతలతో రొయ్య లు, చేపలు మృత్యువాత పడుతుండడంతో లక్షలాది రూపాయలు నష్టపోతున్నారు. వాతావరణంలో మార్పులతో చిరుజల్లు పడడంతోపాటు ఉక్కపోతతో చెరువుల్లో ఆక్సిజన్ లోపిస్తోంది. ఇలాంటి పరిస్థితుల్లో చెరువుల్లో నిరంతరాయంగా ఏరియేటర్లు తిరుగుతూనే ఉండాలి. అయితే గంటల తర బడి విద్యుత్ కోతల కారణంగా ఏరియేటర్లు పని చేయక చెరువుల్లో ఆక్సిజన్ లోపించి రొయ్యలు మృత్యువాత పడడంతో లక్షలాది రూపాయలు నష్టం వాటిల్లుతుందని రైతు లు ఆందోళన చెందుతున్నారు. ప్రత్యామ్నా యంగా జనరేటర్లు అద్దెకు ఏర్పాటు చేసుకో వడానికి రైతులందరూ ఎగబడటంతో వాటి కి డిమాండ్ పెరిగింది. రాత్రి వేళల్లో విద్యుత్ కోత విధిస్తుండడంతో చెరువుల వద్ద అద్దె జనరేటర్లు ఏర్పాటు చేసి ఏరియేటర్లను తిప్పుతున్నారు. పండుగప్ప చెరువుల్లో కూడా ఆక్సిజన్ కొరత ఏర్పడకుండా నిరంత రాయంగా ఏరియేటర్లు తిప్పుతున్నారు. ఆక్సిజన్ లోపిస్తే పండుగప్ప చనిపోయే ప్రమాదముంది. మట్టగుంటలో ఇటీవల సుమారు ఏడేకరాల చెరువుల్లో ఆక్సిజన్ లోపించి పండుగప్పలు మృత్యువాత పడడంతో రైతులకు రూ.70 లక్షల నష్టం వాటిల్లింది. అలాగే పెదలంకలో ఓ రైతుకు చెందిన ఐదేకరాల చెరువులో ఆక్సిజన్ కొరత ఏర్పడి వనామి రొయ్యలు చనిపోవడంతో రూ.10 లక్షలు నష్టం వచ్చింది. కరెంట్ ఎప్పుడు ఉంటుందో తెలియని పరిస్థితి ఉండడంతో రేయింబవళ్లు చేపలు, రొయ్యల చెరువుల వద్ద ఆక్వా రైతులు కాపల ఉంటు న్నారు. కరెంట్ పోగానే ఏరియేటర్లకు జనరేటర్ కనెక్షన్ ఇస్తున్నారు. చేపల చెరువు ల్లో ఆయిలింజన్లను బోటులో అమర్చి తిప్పుతున్నారు. దీంతో చెరువులో కెరటాలు రావడంతో ఆక్సిజన్ ఉత్పన్నమవుతోంది. విద్యుత్ కోత సమయాలను విద్యుత్ శాఖ అధికారులు ప్రకటించాలని పలువురు కోరుతున్నారు.